ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

5
జయశంకర్ భూపాలపల్లి
గురువారం 3 జూలై 2025

ముహూర్తం ఖరారు



- జనవరి 28 నుంచి 31వరకు మేడారం మహా జాతర
- దేవస్థానం అధికారులు, పూజారుల వెల్లడి



మహా జాతరకు ముహూర్తం ఖరారు చేస్తున్న పూజారులు

తాడ్వాయి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం మహాజాతర ముహూర్తం ఖరారైంది. 2026 జనవరి 28 నుంచి 31 వరకుజాతర జరుగుతుందని దేవస్థాన కార్యనిర్వాహక అధికారి వీరస్వామి, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు బుధవారం ప్రకటించారు. వనదేవతలు సమ్మక్క-సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల మహా జాతర నాలుగు రోజుల పాటు జరగనుందని తెలిపారు.

జనవరి 21 మండెమెలుగు

మహాజాతర ప్రారంభానికి ముందు జనవరి 21(బుధవారం) మండే మెలుగు (శుద్ధి పండుగ) కార్యక్రమం జరుగుతుందని ఈవో వీరస్వామి, పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గారావు తెలిపారు. జాతర ముగిసిన అనంతరం ఫిబ్రవరి 4(బుధవారం) తిరుగువారం పండుగ జరుగుతుందని పేర్కొన్నారు. తిరుగువారం తర్వాత వచ్చే మొదటి ఆదివారం పూజారుల వనభోజనాలతో జాతర తంతు పూర్తిగా ముగుస్తుందని జగ్గారావు తెలిపారు.

షెడ్యూల్ ఇలా..

- జనవరి 28 (బుధవారం) సాయంత్రం 6 గంటలకు సారలమ్మ అమ్మవారు మేడారంలోని గద్దెను చేరుతుంది. అలాగే పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెలకు రావడంతో మహా జాతర మొదటి ఘట్టం ప్రారంభమవుతుంది.
- జనవరి 29 (గురువారం) సాయంత్రం 6 గంటలకు వనదేవత సమ్మక్క గద్దెకు చేరుతుంది. దీంతో ప్రధాన ఘట్టం పూర్తవుతుందన్నారు.
- జనవరి 30 (శుక్రవారం) భక్తులు మొక్కులు సమర్పించుకుంటారు.
- జనవరి 31 (శనివారం) సాయంత్రం 6 గంటలకు వనదేవతలు తిరిగి వన ప్రవేశం చేస్తారు. దీంతో నాలుగు రోజుల ఈ మహా జాతర ముగుస్తుంది.

మేడిగడ్డ బ్యారేజీకి వరద జోరు

37వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో.. అంతే నీరుకు దిగువకు



మేడిగడ్డ బ్యారేజీ వద్ద గోదావరి ప్రవాహం

మహదేవపూర్ రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీకి వరద నీరు క్రమంగా పెరుగుతోంది. బ్యారేజీలోకి బుధవారం 36,900 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. ప్రస్తుతం బ్యారేజీ వద్ద 1.40 మీటర్ల ఎత్తులో గోదావరి ప్రవహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

కొత్త కొత్తగా ఉంటదా!?



అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన... కొందరికి మోదాన్ని, మరి కొందరికి ఖేదాన్ని మిగల్చనుందా? కొత్త తరం నేతలను చట్టసభలకు పంపనుందా? రాజకీయ సమీకరణాలను, ముఖచిత్రాన్ని మార్చివేయనుందా? ప్రస్తుతం వున్న నియోజకవర్గాల్లో గల్లంతయ్యేమి ఏమిటి? కొత్తగా అవతరించనున్నవి ఏమిటి?... రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతున్న చర్చ ఇది. అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజనకు కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోందనే వార్తలు.. ఉత్కంఠను రేపుతున్నాయి. పునర్విభజన అనివార్యం కావడంతో ఉమ్మడి జిల్లాలో పలు మార్పులు చోటుచేసుకోనున్నాయి. నియోజకవర్గాల సరిహద్దులతో పాటు రిజర్వేషన్లు కూడా మారే అవకాశం ఉంది. వీటితోపాటు ఏపీ విభజన చట్టంలో పేర్కొన్నట్లుగా తెలంగాణలో కొత్తగా అసెంబ్లీ స్థానాలు పెరగనున్నాయి. 2011 జనాభాతో పాటు, కొత్తగా 12 మండలాలు కరీంనగర్, ఖమ్మం జిల్లాల నుంచి ఉమ్మడి వరంగల్‌లో విలీనం కావటంతో, 3 లేదా 4 కొత్త అసెంబ్లీ స్థానాలు పెరుగుతాయనే భావిస్తున్నారు. 2028, 2029లో ఎన్నికలు పునర్విభజన అనంతర నియోజకవర్గాల్లో జరగనుండటంతో ఆయా నియోజకవర్గాల్లో అప్పుడే రాజకీయ సందడి కనిపిస్తోంది.

- మార్పులు చేర్పులకు కేంద్ర ప్రభుత్వం కసరత్తు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రస్తుతం 12అసెంబ్లీ, 2పార్లమెంట్ స్థానాలు
- జనాభా ప్రాతిపాదికన కొత్తగా మూడు లేదా నాలుగు స్థానాలు పెరిగే ఛాన్స్
- కొత్త జిల్లాల ఏర్పాటుతో పొరుగు జిల్లాల నుంచి విలీనమైన 12 మండలాలు
- ఒకే జిల్లా పరిధిలో అసెంబ్లీ నియోజకవర్గం మొత్తం ఉండటం సాధ్యమేనా
- వరంగల్ జిల్లా ఆరు ముక్కలుగా విడిపోవటంతో డీలిమిటేషన్‌పై ప్రభావం
- రిజర్వేషన్లు కూడా మారే అవకాశం ఉండటంతో ఆశావహుల్లో ఉత్కంఠ

అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజనపై ఉత్కంఠ

▪ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

రాజ్యాంగం ప్రకారం ప్రతి 20 ఏళ్లకు ఒకసారి పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుంది. 2007-08లో జరిగిన పునర్విభజనలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో అసెంబ్లీ స్థానాల సంఖ్య 13 నుంచి 12కు పడిపోయింది. శాయంపేట, చెన్నూరు, చేర్యాల, హనుమకొండ, వరంగల్ అసెంబ్లీ నియోజకవర్గాలు కనుమరుగయ్యాయి. వీటి స్థానంలో కొత్తగా పాలకుర్తి, భూపాలపల్లి, వరంగల్ పశ్చిమ, వరంగల్‌తూర్పు పేరుతో నియోజకవర్గాలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం 2011 జనాభా లెక్కల ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన చేయాల్సి ఉంది. రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణలో నియోజకవర్గాలను పెంచాలనే ప్రతిపాదన ఉంది. రాష్ట్రంలోని ప్రతి ఎంపీ స్థానంలో రెండు అసెంబ్లీ స్థానాలను పెంచాలని అప్పట్లో నిర్ణయించారు. ఈ లెక్కన తెలంగాణలో 17 పార్లమెంట్ స్థానాలు ఉండటంతో కొత్తగా 34 అసెంబ్లీ నియోజకవర్గాలు పెరగనున్నాయి. ఉమ్మడి వరంగల్‌లో రెండు పార్లమెంట్ స్థానాలు ఉన్నాయి. ఈ లెక్కన నాలుగు ఎమ్మెల్యే స్థానాలు పెరగాల్సి ఉంది.

మహబూబాబాద్ ఎంపీ స్థానంలో ఖమ్మం జిల్లాకు చెందిన భద్రాచలం, పినపాక, ఇల్లందు నియోజకవర్గాలు ఉన్నాయి. అయితే జనగామ అసెంబ్లీ నియోజకవర్గం భువనగిరి ఎంపీ పరిధిలో ఉండగా, కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంట్ స్థానాల పరిధిలోని కొన్ని మండలాలు హనుమకొండ, భూపాలపల్లి జిల్లాలో విలీనమయ్యాయి. వీటన్నింటిని కూడా ఒకే పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల్లోకి తీసుకరానున్నారు. పార్లమెంట్ పరంగా చూస్తే నాలుగైదు అసెంబ్లీ స్థానాలు పెరిగే ఛాన్స్ ఉంది. ఇక జనాభా పరంగా ఉమ్మడి వరంగల్

(మిగతా 7వ పేజీలో...)

నగరంలో మరొకటి..

గ్రేటర్ వరంగల్ పరిధిలో ప్రస్తుతం వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాలు పూర్తిగా ఉండగా, వర్ధన్నపేట, పరకాల, స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గాల పరిధిలోని కొన్ని డివిజన్‌లు ఉన్నాయి. నగర జనాభా భారీగా పెరగటంతో పాటు గ్రామీణ ప్రాంతాలు మునిసిపల్ కార్పొరేషన్‌లో విలీనంతో పట్టణీకరణ పెరిగింది. దీంతో డీలిమిటేషన్‌లో పట్టణ అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య పెరుగనుంది. గ్రేటర్ వరంగల్ పరిధిలో 10లక్షలకు పైగా జనాభా ఉంది. ఈ లెక్కన మూడు పట్టణ అసెంబ్లీ స్థానాలతో పాటు మరో అర్బన్, రూరల్ కలిపి మరో అసెంబ్లీ నియోజకవర్గం కూడా ఇక్కడే ఏర్పడే అవకాశముందనే చర్చ జరుగుతోంది. ప్రధానంగా ప్రస్తుతం ఉన్న వరంగల్ ఈస్ట్, వరంగల్ వెస్ట్‌తో పాటు వరంగల్ సెంట్రల్ అసెంబ్లీ స్థానం ఏర్పడే అవకాశం ఉందనే చర్చ జరుగుతుంది. వీటితో పాటు హసన్‌పర్తి లేదా కమలాపూర్‌ను కేంద్రంగా చేసుకుని ధర్మసాగర్, వేలేరు, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి, హసన్‌పర్తి, కమలాపూర్ మండలాలతో మరో అసెంబ్లీ స్థానం ఏర్పడుతుందనే టాక్ వినబడుతోంది. వరంగల్ మహానగరంలోనే ఒకటి లేదా రెండు అసెంబ్లీ స్థానాలు కొత్తగా ఏర్పడే అవకాశం ఉండటంతో అందరి దృష్టి కొత్తస్థానాలపై పడిందనే టాక్ ఉంది.

పంచాయతీరాజ్ ఈఎన్‌సీతో ఎమ్మెల్యే సమావేశం



సమావేశంలో ఈఎన్‌సీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

భూపాలపల్లి టౌన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ ఈఎన్‌సీ కనకరత్నంతో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు బుధవారం సమావేశమయ్యారు. హైదరాబాద్ ఎర్రమంజిల్‌లోని పంచాయతీరాజ్ ఈఎన్‌సీ కార్యాలయంలో ఈ సమావేశం జరగ్గా పలు అంశాలపై సమీక్షించారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న రోడ్ల అభివృద్ధి, పెండింగ్ పనుల పురోగతి, త్వరలో చేపట్టబోయే పనులపై చర్చించారు. పెండింగ్ పనులను యుద్ధ ప్రాతిపాదికన పూర్తి చేయించాలన్నారు. పనుల్లో నాణ్యత పాటించేలా చూడాలని కోరారు. రంగాపురం-రేపాకపల్లి గ్రామాల మధ్య కొత్తగా హైలెవల్ వంతెన నిర్మించాలని, అందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. భూపాలపల్లిలో పంచాయతీరాజ్ డివిజన్ కార్యాలయంతో పాటు రేగొండలో సబ్‌డివిజన్ కార్యాలయం మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్ఈ చక్రవర్తి, ఈఈ వెంకటేశ్వర్లు, పలువురు డీఈఈ, ఏఈఈలు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలి

ఎస్పీ కిరణ్ ఖరే



పోలీస్ స్టేషన్ రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ కిరణ్ ఖరే

టేకుమట్ల, జూలై 2 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని పోలీసులను భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే ఆదేశించారు. టేకుమట్ల పోలీస్ స్టేషన్‌ను ఆయన బుధవారం సందర్శించారు. మొదటగా పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు. అనంతరం సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. రికార్డుల నిర్వహణ, కేసుల స్థితిగతులు పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అను గుణంగా సాంకేతికపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. మీకు కేటాయించడే విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. ప్రజలకు ఎల్లావేళల అందు బాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. స్టేషన్‌లో నమోదయ్యే కేసులను త్వరిగతిన పూర్తిచేసి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. రోడ్లపై విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాల అమర్చే విధంగా ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎస్సై సుధాకర్‌కు ఎస్పీ సూచించారు. ఆయన వెంట భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు, చిట్యాల సీఐ మల్లేష్ ఉన్నారు.

పోలీసుల అదుపులో పలిమెల బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు?

మహదేవపూర్ రూరల్, జూలై 2 : పలిమెల బీఆర్ఎస్ అధ్యక్షుడు జవ్వాజి తిరుపతిని పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఏడాది క్రితం ఒకరి భూమిని ఆయన అక్రమంగా పట్టా చేసుకున్నాడనే ఫిర్యాదు మేరకు అరెస్టు చేసినట్లు సమాచారం. దీనిపై పలిమెల ఎస్సైను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

తరగతి ఇంతేనా...?



కాటారంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇద్దరే విద్యార్థినులు

గోడలకు బీటలు వారిన తాడిచర్ల కళాశాల భవనం

- సమస్యల వలయంలో జూనియర్ కాలేజీలు
- అరకొర సౌకర్యాల నడుమ విద్యా బోధన
- క్లాసులకు హాజరు కాలేని పరిస్థితుల్లో విద్యార్థులు
- అధ్యాపకులు ఉన్నా.. పెరగని అటెండెన్స్

భూపాలపల్లిటౌన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. అరకొర సౌకర్యాల నడుమ కొనసాగుతున్నాయి. దీంతో విద్యార్థులు అవస్థ పడుతున్నారు. ముఖ్యంగా విద్యార్థులకు మరుగుదొడ్లు లేవు. తాగునీటి సౌకర్యం సరిగా లేదు. పలు కళాశాలల భవనాలు శిథిలా వస్థకు చేరుకున్నారు. కొన్నిటికి ప్రహరీలు లేక అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారాయి. అత్యధిక కాలేజీల్లో స్కావెంజర్లు, వాచ్‌మన్లు లేరు. అలాగే జిల్లాలో ఏ కళాశాలకు కూడా ఇప్పటి వరకు స్పోర్ట్ మెటీరియల్ ఇచ్చిన దాఖలాలు లేవు. క్రీడలపై విద్యార్థులకు ఆసక్తిని కలిగించిన సందర్భాలు కానరావు. పరిస్థితి ఇలా ఉంటే చదువులు సాగేదెలా? అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



భూపాలపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాలికల మరుగుదొడ్ల వద్ద ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు

అరకొర సౌకర్యాలతో అవస్థలు

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 30 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో డే స్కాలర్స్ కళాశాలలు ఐదు కొనసాగుతున్నాయి. అవి భూపాలపల్లి, మహదేవపూర్, కాటారం, చిట్యాల, మల్హర్ మండలం తాడిచర్లలో ఉన్నాయి. అలాగే జిల్లాలో మోడల్ స్కూళ్లలో ఆరు కళాశాలలు ఉన్నాయి. 12 మండలాల్లో 11 కేజీబీవీలు ఉండగా అందులో 11 జూనియర్ కళాశాలలు నడుస్తున్నాయి. రెండు సోషల్ వెల్ఫేర్, రెండు ట్రైబల్ వెల్ఫేర్, మూడు బీసీ వెల్ఫేర్, ఒకటి మైనారిటీ కళాశాలలు ఉన్నాయి. అయితే.. హాస్టల్ కళాశాలల్లో 80శాతం వరకు మెరుగైన సౌకర్యాలే ఉన్నప్పటికీ డే స్కాలర్ కళాశాలల్లో మాత్రం అరకొరగా ఉన్నాయి.

ఏ కాలేజీలో చూసినా అవే సమస్యలు

భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాలలో 300 మంది విద్యార్థులు ఉండగా 15 మంది అధ్యాపకులు బోధిస్తు న్నారు. ఈ కళాశాలలో బాలురకు మరుగుదొడ్లు లేవు. సైన్స్ ల్యాబ్‌కు ఇక్కడ నాలుగు గదులు అవసరం ఉన్నాయి. ఈ కాలేజీలో వాటర్ ప్యూరిఫైడ్ మిషన్ ఉన్నప్పటికీ అది గత కొద్ది రోజులుగా పనిచేయడం లేదు. దీంతో తాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అలాగే కాటారంలో ఏడుగురు అధ్యాపకులు ఉన్నారు. ఇద్దరు నాన్ టీచింగ్ సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌తోనే ఈ కాలేజీ కొనసాగుతోంది. ఇక్కడ మరుగుదొడ్లు లేవు. బాలికలకు ఉన్నప్పటికీ వాటిలో నీటి సౌకర్యం లేదు. దీంతో ఈ కాలేజీలో విద్యార్థులు సరిగా హాజ రుకావడం లేదని తెలుస్తోంది. మొదటి సంవత్సరం లో 21 మంది (మిగతా 8వ పేజీలో)

మూడు నెలలలోపు అబార్షన్ లీగలే..

ప్రశ్నోత్తరాలు



డాక్టర్ బి. కవిత, ప్రొఫెసర్ ఆఫ్ గైనకాలజీ

ప్రశ్న: వర్షాకాలంలో గర్భిణులు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి?

జవాబు : సీజనల్ వ్యాధుల బారిన పడకుండా గర్భిణులు కల్తీ లేని ఆహారం, తాగునీరు తీసుకోవాల్సి ఉంటుంది. గర్భిణుల్లో రోగనిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. అదుకు తొందరగా రోగాలబారినపడే అవకాశం ఉంది.

ప్ర: గర్భం దాల్చిన మహిళలు ఎలాంటి వ్యాధుల బారినపడుతారు?

జ: గర్భం దాల్చిన మహిళలు ప్రధానంగా రక్తహీనత సమస్య బారిన పడుతుంటారు. రక్తహీనతకు గురికాకుండా పౌష్టికాహారం తీసుకోవాలి. గర్భిణులు రక్తహీనతకు గురికాకుండా ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం పంపిణీ చేస్తోంది.

ప్ర: ఇద్దరు పిల్లలు ఉన్న మహిళ గర్భందాల్చితే అబార్షన్ చేయించుకోచ్చా?

జ: ఇద్దరు పిల్లలు ఉన్న మహిళ గర్భం దాల్చితే మూడు నెలలలోపు అబార్షన్ చేసుకోవడం లీగలే అవుతుంది. సంబంధిత డాక్టర్‌ను సంప్రదించి అబార్షన్ చేసుకోవాల్సి ఉంటుంది. గర్భం రాకుండా పురుషులు కండోమ్స్ మహిళలు ఇంజెక్షన్లు, మందులు వాడాల్సి ఉంటుంది. మహిళలు గర్భం దాల్చకుండా కాపర్-టీ కూడా అందుబాటులో కలదు.

ప్ర: గర్భిణులు నార్మల్ డెలవరీ అయ్యే అవకాశాలు ఏ మేరకు ఉంటాయి?

జ: గర్భిణులు అన్ని పనులు చేసుకోవచ్చు. అలా అయితేనే వారికి నార్మల్ కాన్పు అయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఏం పనులు చేయకుండా చాలా మంది రెస్ట్ తీసుకుంటారు. దీని వల్ల పెరినీయాం కండరాలు తెరుచుకోక సెక్షన్‌లు అవుతున్నాయి.

ప్ర: జీజీహెచ్‌లో గర్భిణులకు ఎటువంటి సేవలు అందుతున్నాయి?

జ: జీజీహెచ్‌లో గర్భిణులకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి. మెడికల్ కాలేజీ ఆస్పత్రికి అనుసంధానం కావడంతో సీనియర్ వైద్యులు అందుబాటులో ఉన్నారు. ప్రైవేటుకు దీటుగా జీజీహెచ్‌లో సేవలు అందిస్తున్నాం.

- భూపాలపల్లి కలెక్టరేట్ (ఆంధ్రజ్యోతి)

ఢీకొన్న ద్విచక్ర వాహనాలు

- ఇద్దరికి గాయాలు.. మహాముత్తారం మండలంలో ప్రమాదం

ఇసుక లారీ డ్రైవర్ల ఆందోళన

- బెగ్లూర్ క్వారీ సిబ్బంది తీరుపై ఆగ్రహం
- లోడింగ్ చేయక వేధిస్తున్నారని నిరసన

పిల్లలను ప్రభుత్వ పాఠశాల్లోనే చదివించాలి

- ప్రైవేటు స్కూల్స్ బస్సులను అడ్డుకున్న గ్రామస్థులు

వివరాలు 6వ పేజీలో..



కేసముద్రంలో బహిరంగ సభ నిర్వహించే స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

6న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రాక

బహిరంగ సభ స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే మురళీనాయక్

కేసముద్రం, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం మండలంలోని పలు అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ఈనెల 6న వస్తున్నారని ఎమ్మెల్యే మురళీనాయక్ తెలిపారు. ఉపముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా నిర్వహించే బహిరంగ సభ స్థలాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం స్థానిక గణపతిఫంక్షన్ హాల్‌లో సన్నాహాక సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలోనే కేసముద్రం అభివృద్ధిలో ముందుందని తెలిపారు. 15వేల మందితో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు ఏ సమయంలోనైనా నోటిఫికేషన్ విడుదలవుతుందని, దీనికి కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు భరత్‌చందర్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 6న విరసం ఆవిర్భావ సభ

జనగామ కల్చరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): విప్లవ రచయితల సంఘం (విరసం) ఆవిర్భావ సభ జూలై 6న నిర్వహిస్తున్నట్లు విరసం ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ కోడం కుమారస్వామి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.నాగేశ్వర్, జి.కళావతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 గంటలకు సభ నిర్వహిస్తామన్నారు. ఆదివారం ఉదయం సెషన్‌లో 'కాల్పుల విరమణ ఒప్పందాలు - మార్క్సిస్టు దృక్పథం', మధ్యాహ్నం 'ఫాసిస్టు చుట్టివేత దాడి - విప్లవోద్యమ పంథా', సాయంత్రం 3 గంటలకు 'తెలంగాణలో శాంతి చర్చల ఆవశ్యకత' అంశాలపై ప్రసంగాలు ఉంటాయన్నారు. కవులు, రచయితలు, మేధావులు, విద్యార్థులు, టీచర్లు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని వారు కోరారు.

రెండోరోజు నిరాహార దీక్షలో మహిళా రైతులు



నారాయణపురంలో రిలే నిరాహారదీక్షల్లో కూర్చున్న మహిళా రైతులు

కేసముద్రం, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపురంలో ఎంజాయ్‌మెంట్ సర్వే ప్రకారం పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వాలనే డిమాండ్‌తో నిర్వహిస్తున్న రిలే నిరాహారదీక్షలు బుధవారం రెండో రోజు మహిళా రైతులు నిర్వహించారు. ఈ దీక్షల్లో రైతులు రాధమ్మ, వసంత, శ్రీలత, అనిత, ఎల్.పద్మ, ఎస్.పద్మ, రజిత, నిర్మల, రాణి, సరోజన రఘువమ్మ పాల్గొన్నారు.

ఇసుక లారీ డ్రైవర్ల ఆందోళన

- బెగ్లూర్ క్వారీ సిబ్బంది తీరుపై ఆగ్రహం
- లోడింగ్ చేయక వేధిస్తున్నారని నిరసన
- టీజీఎండీసీ పీవో స్పందించడం లేదని ఆరోపణ

మహదేవపూర్ రూరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని బెగ్లూర్ ఇసుక క్వారీ వద్ద సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ తమను వేధిస్తున్నారని పలువురు లారీ డ్రైవర్లు బుధవారం మధ్యాహ్నం ఆందోళనకు దిగారు. తమ సమస్యపై ఫిర్యాదు చేస్తే టీజీఎండీసీ పీవో స్పందించడం లేదని మహదేవపూర్ మండల కేంద్రంలో రాస్తారోకో చేశారు. పది రోజులైనా తమ లారీల్లో ఇసుక లోడింగ్ చేయడం లేదన్నారు. లోకల్ పేరుతో వచ్చిన వాళ్లను మాత్రం ఇష్టారీతిన ఏరోజుకారోజే అదనపు లోడు వేసి పంపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పదిరోజులుగా లోడింగ్ చేయకపోవడంతో పీవో ఇప్పటి వరకు కన్నెత్తి చూడటం లేదని, ఫోన్‌చేస్తే తమ నెంబర్లు బ్లాక్‌లిస్టులో పెడుతున్నారని అన్నారు. కనీసం క్వారీ వద్ద ఉన్న టీజీఎండీసీ సిబ్బందినైనా పట్టించుకుంటారంటే వాళ్లు కూడా అస్సలు స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. లోకల్ వాళ్లమంటూ ఒక్కోసారి 40లారీలను పంపిస్తున్నారని, తమను మాత్రం పది రోజులుగా ఇక్కడే ఉంచుతున్నారని మండిపడ్డారు.

క్వారీలో సమయపాలన పాటించడం లేదని, రాత్రంతా లోడింగ్ చేసి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని ఆరోపించారు. వర్షం పడిన రోజే లోడింగ్ చేస్తున్నారని, ఎండకొడితే లోడింగ్ ఆపేస్తున్నారని తెలిపారు. లోకల్‌కు ఒకలా నాన్‌లోకల్‌కు ఒకలా ప్రాధాన్యమివ్వడమేమిటని ప్రశ్నించారు. లోడింగ్ చేయమని లారీని ముందుకు తీసుకెళ్తే 'బిడ్డా.. సంపుతాం, బొందపెడతాం' అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే పీవోను కలవమని పోలీసులు చెప్పారని అన్నారు. పీవో మాత్రం అస్సలు స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి లోడింగ్ వెంటనే చేసేలా చర్యలు తీసుకోవాలని, సంబంధిత పీవో, సిబ్బంది, క్వారీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



మండల కేంద్రంలో ఆందోళన చేస్తున్న లారీ డ్రైవర్లు

మంత్రిపై అసత్య ప్రచారాలు చేస్తే సహించం

- ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్

ములుగు, జూలై 2(ఆంధ్రజ్యోతి): మంత్రి సీతక్కపై అసత్య ప్రచారాలు చేస్తే సహించేది లేదని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్ హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని పత్రికలు, కొందరు నాయకులు పనిగట్టుకుని మంత్రి సీతక్క, జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ మీద, కాంగ్రెస్ ఇతర నాయకులపై దుష్ప్రచారం చేయడం హేయమన్నారు. కాంగ్రెస్‌లో చిచ్చు పెట్టేందుకే నాగన్న పేరుతో కరపత్రం వేశారని అన్నారు.

తామంతా ఐకమత్యంతోనే పనిచేస్తున్నామని, చిల్లరాజకీయాలు మానుకుంటే మంచిదని హితవు పలికారు. కొందరు పనిగట్టుకుని జిల్లాలో అభివృద్ధి జరగడంలేని ప్రచారం చేస్తున్నారని, ములుగు జిల్లా బీఆర్ఎస్ హయాంలో ఎలా ఉందో... ఇప్పుడు ఎలా ఉందో వారికి కనబడడం లేదా? ప్రశ్నించారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా చూసిన ఈ ప్రాంతాన్ని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సీతక్క అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తోందన్నారు. జిల్లా అభివృద్ధికి అహర్నిషలు కష్ట పడి పనిచేస్తున్న మంత్రి సీతక్కపై నిరాధారమైన ఆరోపణలకు పాల్పడితే సహించేది లేదన్నారు. ఈ విలేకరుల సమావేశంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవి యాదవ్, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపెల్లి రాజేందర్, పట్టణ అధ్యక్షుడు భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

సీతక్క ప్రజల మనిషి

మావోయిస్టులు లేఖ విడుదల చేయడం దురదృష్టకరం

కాంగ్రెస్ నాయకుడు సూర్యనారాయణ

వెంకటాపూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క ప్రజల మనిషి అని, జీవో 49కి ఆమె మద్దతు ఇచ్చారని మావోయిస్టు పార్టీ లేఖ విడుదల చేయడం దురదృష్టకరమని కాంగ్రెస్ ములుగు జిల్లా వెంకటాపురం మండల అధ్యక్షుడు చెన్నోజు సూర్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలో ఆయన బుధవారం విలేక రుల సమావేశం నిర్వహించారు. మంత్రి సీతక్క అధికారంలో ఉండి కూడా జీవో 49కి వ్యతిరేకంగా తీర్మానం చేయగా కొందరు ప్రతిపక్ష నాయకులు ము లుగు అడవులను అదానీ, అంబానీలకు తాకట్టుపెడుతున్నారని ఆరోపిస్తూ కుట్రలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు.

బీజేపీ ప్రభుత్వం చత్తీస్‌గఢ్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక అక్కడి అడవుల్లో ఉన్న ఖనిజ సంపదను దోచుకోవడా నికే మాయిస్టులను ఆపరేషన్ కగార్ పేరుతో కనికరం లేకుండా చంపుతుంటే ప్రశ్నించాల్సిన ప్రతిపక్షాలు సీతక్కపై లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదని హితవు పలికారు. మంత్రి సీతక్క ములుగు అడవులను కాపాడుకుంటారని, కమీషన్లు, ఆస్తుల కోసం అడవిని నాశనం చేసే నాయకురాలు కాదని అన్నారు. అదేవిధంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్‌పై కొందరు ప్రతిపక్ష నాయకులు కుట్రలు చేస్తున్నారని, నాగన్న అనే డమ్మీపేరుతో ప్రతిపక్ష నాయకులు వేసిన వలలో ఎవరూ పడొద్దని అన్నారు. ఈసమావేశంలో నాయకులు మూడ్ వీరేష్, బానోత్ భాస్కర్, మార్క జయశంకర్, ఎమ్డీ.వసీం మహ్మద్, జనగాం నాగరాజు, బండ్ల రాజయ్య, రమేష్, సోనీ, శరత్ తదితరులు పాల్గొన్నారు.

వట్టేవాగు సమ్మక్క సారలమ్మ జాతర షెడ్యూల్ ఖరారు

గూడూరు, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లాలోనే అతిపెద్ద ఆదివాసీ జాతర చింతలగట్టు వట్టేవాగు సమ్మక్క-సారలమ్మ జాతర షెడ్యూల్‌ను ఖరారు చేసినట్లు పూజారుల కమిటీ అధ్యక్షులు దారం సిద్ధు, జాతర కమిటీ చైర్మన్ కారం లక్ష్మయ్య తెలిపారు. జాతర ఆవరణలో బుధవారం జాతర కమిటీ సభ్యులు, పూజారులు సంయుక్త సమావేశం నిర్వహించారు. 2026 జనవరి 28న సాయంత్రం 6 గంటలకు సారలమ్మ అమ్మవారు గద్దెకు వచ్చుట, గోవిందరాజు, పగిడిద్దరాజులను గద్దెలకు చేర్చుట, 29న సాయంత్రం 6 గంటలకు శ్రీ సమ్మక్క అమ్మవారిని గద్దెలకు తీసుకువచ్చుట, కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. 30న మొక్కులు సమర్పించుట, 31న సాయంత్రం 6 గంటలకు సమ్మక్క-సారలమ్మ అమ్మవార్లు, గోవిందరాజు, పగిడిద్దరాజులకు వన ప్రవేశం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఈ సమావేశంలో జాతర నిర్వాహకులు, పూజారులు ఈసం సహదేవులు, వాసం భద్రయ్య, తాటి సుధాకర్, దారం సాంబరాజు, ససుప వీరస్వామి, పూనెం జనార్దన్, దారం నరేష్, సిద్ధబోయిన కోటయ్య, వాసం రమేష్, కొట్టెం వజ్జయ్య, పొడుగు వీరభద్రం, పూనెం అశోక్, కోర్సా గోవర్ధన్, ఈసం భద్రమ్మ, బిజ్జ బుచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.



జాతర ప్రాంగణంలో జాతర షెడ్యూల్ కాపీని పూజారులకు అందిస్తున్న జాతర చైర్మన్ కారం లక్ష్మయ్య



ప్రైవేటు స్కూల్ బస్సును అడ్డుకుంటున్న గ్రామస్థులు

ప్రైవేటు పాఠశాల బస్సులను అడ్డుకున్న గ్రామస్థులు

రేగొండ, జూలై 2(ఆంధ్రజ్యోతి) : పిల్లలను తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని భూపాలపల్లి జిల్లా తిరుమలగిరికి చెందిన పలువురు గ్రామస్థులు నినదించారు. ప్రైవేటు పాఠశాలలకు వెళ్తున్న వారి బస్సులను బుధవారం అడ్డుకున్నారు. 'ప్రైవేట్ స్కూల్స్ వద్దు.. ప్రభుత్వ బడే ముద్దు' అని నినాదాలు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటుకు దీటుగా నాణ్యమైన విద్య అందుతోందన్నారు. ఈ కార్యక్రమంలో జీడ్పీహెచ్ఎస్ చైర్మన్ నిర్మల, ప్రైమరీ స్కూల్ చైర్మన్ వసంతతోపాటు విజేందర్, వెంకటస్వామి, తిరుపతి, కిరణ్, శంకర్, శ్రీధర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రమాదంలో గాయపడ్డ ముదురుకోళ్ల దేవేందర్, గాజుల మధు

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు

మహాముత్తారం, జూలై2(ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు గాయపడిన సంఘటన భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలంలోని కోనంపేట వద్ద బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. కోనంపేట నుంచి మహాముత్తారం గ్రామానికి వెళ్తున్న అదే గ్రామానికి చెందిన గావిడి సాగర్ ద్విచక్ర వాహనాన్ని భూపాపల్లి మండలం ఆజంనగర్‌కు చెందిన ముదురుకోళ్ల దేవేందర్ ఢీకొన్నాడు. దీంతో దేవేందర్‌తోపాటు అదే వాహనంపై వెనుక ఉన్న గాజుల మధు గాయపడ్డారు. వీరిద్దరు మద్యం మత్తులో ఉండటంతోనే ప్రమాదం జరిగిందని గ్రామస్థులు తెలిపారు. వీరిని 108 వాహనంలో భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించినట్లు మహాముత్తారం ఎస్సై మహేందర్ కుమార్ తెలిపారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

కురవి, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో డోర్నకల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి సత్తా చాటాలని డిప్యూటీ స్పీకర్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచందర్‌నాయక్ అన్నారు. కురవి మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఇప్పటి నుంచే ప్రజలతో మమేకమై ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమపథకాలను ప్రజల్లో తీసుకువెళ్లాలన్నారు. ఈ నెల 4న హైదరాబాద్‌లో జరిగే సమావేశానికి జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే హాజరవుతున్నారని, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు అంబటి వీరభద్రం, దేవాలయ చైర్మన్ కోర్ని రవీందర్‌రెడ్డి, గార్లపాటి వెంకట్‌రెడ్డి, బండి శ్రీనివాస్, అవిరె మోహన్‌రావు, కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, ఎన్.రాజేందర్‌కుమార్, పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జోరుగా వర్షాలు

- మహబూబాబాద్ జిల్లాలో 86.8 మిమీ వర్షపాతం నమోదు

హనుమకొండ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో బుధవారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి. మహబూబాబాద్ జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదైంది. ఈ జిల్లాలో 86.8 మిమీ వర్షం కురిసింది. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలో 57.1 మిమీ, వరంగల్ జిల్లాలో 55.5 మిమీ, హనుమకొండ జిల్లాలో 44.2 మిమీ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్‌లో 45 మిమీ, జనగామ జిల్లా చిల్పూర్‌లో 28.8 మిమీ వర్షపాతం నమోదైంది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు వర్షం కురుస్తూనే ఉంది. వచ్చే మూడు రోజులు ఉమ్మడి జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ఆర్టీసీ బస్సు ఢీకొని రైతు లావుడ్యా కుమార్ (34) మృతి చెందగా, లకావత్ భిక్షపతి అనే వృద్ధుడికి తీవ్రగాయాలైన ఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జిట్టిగూడెం గ్రామానికి చెందిన లావుడ్యా కుమార్, ఆయన సమీప బంధువు లకావత్ భిక్షపతితో కలిసి వ్యక్తిగత పనుల నిమిత్తం బైక్‌పై ఘన్‌పూర్‌కు వచ్చారు. పనులు ముగించుకొని గ్రామానికి వెళ్తుండగా మండల కేంద్రంలోని మోడల్ కాలనీ ఎదురుగా జాతీయ రహదారిపై బైక్ అదుపుతప్పి కిందపడిపోయారు. అదే సమయంలో



మృతి చెందిన రైతు లావుడ్యా కుమార్

తీవ్రంగా గాయపడిన వృద్ధుడు

హనుమకొండ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న బస్సు కుమార్ పై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందగా, భిక్షపతికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని తీవ్రంగా గాయపడిన భిక్షపతిని ఆస్పత్రికి తరలించారు. కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుమార్‌కు భార్య నిహారిక (కవిత), కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జి. వేణు తెలిపారు.

వరి నారుతో కేసీఆర్ పేరు

గిరిజన రైతు వినూత్న ఆలోచన

బయ్యారం, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓ గిరిజన రైతు తన పొలంలో మాజీ సీఎం కేసీఆర్‌పై ఉన్న అభిమానంతో కేసీఆర్ పేరు కనపడేలా వినూత్న రీతిలో వరి నారు నాటాడు. ఇందుకు సంబంధించిన వివరాల ఇలా ఉన్నాయి. కస్తూరీనగరం గ్రామానికి చెందిన బాదవత్ లాలు బుచ్చమ్మల దంపతులకు ఇరువురు సంతానం. పెద్ద కుమారుడు వెంకన్న ఆర్మీలో ఉద్యోగం చేస్తుండగా.. చిన్న కుమారుడు రవి తనకున్న పది ఎకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా నాలుగున్నర ఎకరాల పొలంలో వరి నారు పోశాడు. అయితే అదే సమయంలో తన ఖాతాలో రైతుభరోసా డబ్బులు జమ అవడంతో రవికి వినూత్న ఆలోచన తట్టింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అసలు రైతుబంధు కార్యక్రమానికి రూపకల్పన చేసింది కేసీఆర్ కదా.. అని వెంటనే తన పొలంలో కేసీఆర్ పేరు కనపడేలా వడ్లు చల్లాడు.



పొలంలో కేసీఆర్ పేరు కనపడేలా నారు పోసిన రైతు రవి

నారు పెరిగిన తరువాత పొలంలో కేసీఆర్ పేరు కనిపిస్తుండటంతో పలువురు ఆసక్తిగా తిలకిస్తున్నారు. మొదటి నుంచి కేసీఆర్ అంటే అభిమానమని, రైతుబంధు రూపకల్పన చేసిందే కేసీఆర్ అని అందుకే ఆయనపై అభిమానంతో ఇలా చేశానని రవి తెలిపాడు. కాగా ఈ విషయం బుధవారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

తప్పుల తడకగా అతిథి అధ్యాపకుల నియామకం

నిబంధనలకు తిలోదకాలు

డీఈవో లేకుండానే ఇంటర్వ్యూలు

డైట్, బీఈడీ కళాశాలల్లో ఎంపికలపై ఆరోపణలు

హనుమకొండ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని ప్రభుత్వ డైట్, బీఈడీ కళాశాలల్లో అతిథి అధ్యాపకుల నియామకాలు పారదర్శకంగా జరగలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బీఈడీ కళాశాలలో అనుభవం ఉన్న అధ్యాపకులను కాదని, ప్రైవేటు కళాశాలల్లో పని చేస్తున్నవారి చేత దరఖాస్తులు దాఖలు చేయించుకున్నారని, దీంతో 140కిపైగా దరఖాస్తులు వచ్చాయని, తీరా ఇంటర్వ్యూ సమయానికి సాంఘిక సంక్షేమ శాస్త్రానికి ఇద్దరు, ఫిలాసఫీకి ఒక్కరే హాజరు కావడంలోని మతలబేమిటని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. ఇందులో కూడా బీఎడ్ కళాశాలలో అనుభవం ఉన్న అధ్యాపకుడు నాగరాజును ఆ కళాశాలలో కాకుండా డైట్‌కు పంపడంలోని ఆంతర్యమేమిటని ప్రశ్నిస్తున్నారు. ఒక వేళ సరిపోయే అధ్యాపకులు రానప్పుడు మరోసారి నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉండేదంటున్నారు. ఎంపికలో అనుభవం, అర్హతకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టమైన నిబంధనలు ఉన్నా, గతంలో బీఎడ్ కళాశాలలో ఆంగ్ల అధ్యాపకుడిగా పని చేసిన అధ్యాపకుడు అరుణాచారిని తీసుకోలేదన్నారు.

బీఎడ్ కళాశాలలో నిర్వహించాల్సిన ఇంటర్వ్యూలు డైట్ కళాశాలలో నిర్వహించారని, బీఎడ్ విద్యార్థులు లేకుండానే డైట్ విద్యార్థులతో డెమోలు ఇప్పించారని ఆరోపించారు. ఇంటర్వ్యూల సమయంలో నియామక కమిటీ చైర్మెన్ అయిన డీఈవో రాలేదని, దీంతో ఇంచార్జి ప్రిన్సిపాల్ ఇష్టారీతిన వ్యవహరించారని ఆరోపించారు. మెరిట్ లిస్టులో 5వ నంబర్‌లో ఉన్న అభ్యర్థిని ఎంపిక చేశారన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గతంలో రెండు సార్లు సస్పెండ్ అయిన చరిత్ర ఉందని గుర్తు చేశారు. ఈ దృష్ట్యా అతిథి అధ్యాపకుల నియామకాలపై సమగ్ర విచారణ చేపట్టాలని అభ్యర్థులు కోరుతున్నారు. ఈ విషయంలో కలెక్టర్ చొరవ తీసుకొని అర్హులకు న్యాయం చేయాలని అభ్యర్థించారు.

విద్యుత్ ఉద్యోగులకు భరోసా

- అందుబాటులోకి వచ్చిన బీమా పథకం
- విధినిర్వహణలో మృతి చెందితే రూ. కోటి పరిహారం
- తీవ్రంగా గాయపడితే రూ. 80 లక్షలు
- సహజ మరణం చెందితే రూ. 10 లక్షలు
- 13 వేల మంది ఉద్యోగులకు లబ్ధి
- ఎస్‌బీఐ, యూబీఐలతో ఒప్పందం



హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్‌పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం

హనుమకొండ, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ ఉద్యోగమంటే ప్రాణంతో చెలగాటం. ప్రమాదం ఎప్పుడు ఎక్కడి నుంచి ముంచుకు వస్తుందో తెలియదు. నిత్యం ప్రమాదం అంచున ఉద్యోగులు పని చేయాల్సి ఉంటుంది. అటువంటి వారికి సామాజిక, ఆర్థిక భద్రత కల్పించేందుకు బీమా అమలులోకి వచ్చింది. నార్తరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఎన్‌పీడీసీఎల్) సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని విద్యుత్ ఉద్యోగులందరికీ బీమా సౌకర్యం కల్పించారు.

రూ. కోటి పరిహారం

గతంలో విద్యుత్ ఉద్యోగి విధినిర్వహణలో మరణించినా, తీవ్రంగా గాయపడినా, సంస్థ అందించే పరిహారం లేదా వారు వ్యక్తిగతంగా చేసుకున్న బీమా పాలసీల ద్వారా పరిహారం అందేది. ఇది ఆశించినంత మేరకు ఉండేది కాదు. కానీ ఈ బీమా సౌకర్యం వల్ల విధినిర్వహణలో విద్యుత్ ఉద్యోగి మరణిస్తే (ఎఐ) రూ. కోటి వరకు బీమా పరిహారం కుటుంబానికి లభిస్తుంది. అలాగే ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కదలలేని స్థితిలో (పీటీడీ) ఉన్న ఉద్యోగులకు సైతం రూ.కోటి వరకు బీమా పరిహారం అందేలా ఏర్పాట్లు చేశారు. శాశ్వత అంగవైకల్యం (పీపీడీ) కలిగిన వారికి రూ. 80 లక్షల వరకు పరిహారం అందుతుంది. ఉద్యోగి సహజ మరణం చెందితే రూ. 10 లక్షల వరకు ప్రమాద బీమా ఉంటుంది. ఉద్యోగితో పాటు నలుగురు కుటుంబ సభ్యులకు కలిపి రూ.20 లక్షల వరకు బీమా సౌకర్యం వర్తిస్తుంది. ఈ మేరకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), యూనియన్ బ్యాంక్ (యూబీఐ)తో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఎస్‌బీఐలో ఖాతా తెరిచిన విద్యుత్ ఉద్యోగులకు కేవలం ప్రమాద బీమానే కాకుండా పెళ్లి, విద్యాపరమైనా ఆర్థిక సహాయంలోనూ రుణాలు అందించనున్నారు.

ఎలాంటి కంట్రిబ్యూషన్ లేకుండానే..

బీమా పొందాలంటే ప్రత్యేకంగా పాలసీ తీసుకోవలసిన అవసరం లేదు. ఉద్యోగి బ్యాంకు ఖాతాలో ప్రతీనెల వేతనం జమ చేస్తూనే బీమాను వర్తింపచేస్తున్నారు. విద్యుత్ సిబ్బందిలో నమ్మకం, ధైర్యాన్ని ఇవ్వడం కోసం ఎలాంటి కాంట్రిబ్యూషన్ లేకుండా ఈ పథకాన్ని తీసుకువచ్చారు.

నిబంధనలు

ఉద్యోగి వేతనం నెలకు రూ. 25 వేలకుపైగా ఉంటే చాలు. ఒప్పందం చేసుకున్న బ్యాంకుల్లో ప్రతీ నెల జీతం జమ కావడమే ఈ బీమాకు అర్హత. ప్రారంభంలో మొదటి నెల 1న జీతం జమ చేస్తే మరుసటి నెల 1 నుంచి బీమా వర్తిస్తుంది. మూడు నెలల్లో ఒక్కసారైనా ఏటీఎం నుంచి డబ్బులు తీసుకొని ఉండాలి. ఎన్‌పీడీసీఎల్ పరిధిలో పని చేసే అటెండర్, వాచ్‌మన్ మొదలుకొని ఎస్ఈ వరకు బీమా వర్తిస్తుంది. ఈ బీమా పథకం ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని 16 జిల్లాల్లో పని చేస్తున్న 13,287 మంది ఉద్యోగులకు వర్తిస్తుంది. వీరిలో ఉద్యోగులు 9821 కాగా అర్టిజన్ కార్మికులు 3466 మంది. బీమా పథకంలో ఎస్‌బీఐలో 11287 మంది, యూబీఐలో 2000 మంది ఉద్యోగులు నమోదయ్యారు. ఈ బీమా పాలసీ కింద ఇప్పటికే ఒక ఉద్యోగి కుటుంబానికి పరిహారం అందింది. కరీంనగర్ రూరల్ డివిజన్ చెంజెర్ల పరిధిలో అసిస్టెంట్ లైన్‌మన్ జోగు నరేష్ విధి నిర్వహణలో ఉండగా గత సంవత్సరం అక్టోబరులో ప్రమాదానికి గురై మృతి చెందారు. బ్యాంకు బీమా పథకంలో నమోదై ఉండడంతో నరేష్ భార్య సుష్మకు రూ. కోటి బీమా పరిహారాన్ని గత నెల 26న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా అందజేశారు.



విలన్ పాత్రలో రవి

చావు డప్పు నుంచి.. చలన చిత్రాల వరకు..



రుషి వేషంలో రవి

- దినదిన ప్రవర్ధమానం చెందుతున్న కోగిల రవి
- లఘుచిత్రాల ద్వారా యూట్యూబ్‌లో గుర్తింపు
- ఇప్పటికే 8లక్షలకు చేరిన సబ్‌స్క్రైబర్లు
- 200కు పైగా వీడియోలు అప్‌లోడ్
- పల్లెపాటలపై ఎక్కువ ఫోకస్



బోనాల పాటలో భాగంగా..

పరకాల, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ప్రతీ మనిషి ఏదో ఒక రంగంలో గుర్తింపు పొందేందుకు కృషి చేస్తూనే ఉంటాడు. ఈ కోవలోనే పరకాల పట్టణానికి చెందిన కోగిల రవి నటుడిగా రాణించాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. ఎప్పటికైనా తనను తాను తెరపై చూసుకోవాలనుకున్నాడు. ఇందు కోసం తన కులవృత్తి అయిన చావు డప్పు వాయించడం నుంచే పునాది వేసుకున్నాడు. ప్రైవేట్ ఆల్బమ్స్ చేస్తూ ప్రస్థానం ప్రారంభించాడు. పల్లెపాటలు, లఘు చిత్రాలలో నటిస్తూ క్రమంలో యూట్యూబ్‌లో ప్రవేశించాడు. తాను చేసిన చిన్న చిన్న చిత్రాలను, పాటలను యూట్యూబ్‌లో పెట్టి ప్రేక్షకాదరణ పొందాడు. ఎట్టకేలకు తన కష్టానికి గాను సినిమాలో నటించే అవకాశం లభించడంతో రవి సంతోషం వ్యక్తం చేస్తున్నాడు. పరకాల పట్టణం మాదారం కాలనీ చెందిన కోగిల రవి, రాణి దంపతులకు అరవింద్, విన్ని ఇద్దరు కుమారులు. పట్టణంలోని బస్టాండ్ సమీపంలో పాన్‌షాపు ఏర్పాటు చేసుకొని వీరి జీవితం కొనసాగించాడు. కులవృత్తిలో భాగంగా రవి దహన సంస్కారాల్లో డప్పు వాయించేందుకు వెళ్లేవాడు. అదేకాకుండా ఎన్నికల ప్రచారాలకు, గ్రామాల్లో చాటింపులకు వెళ్లి డప్పువాయించి వచ్చిన కాస్త ఆదాయంతో తమ కుటుంబాన్ని పోషించేవాడు. తనకు చిన్నప్పటి నుంచి సినిమాలు చూడటం, డాన్స్ చేయడం తాను నటించి తెరపై చూసుకోవాలని ఎంతో ఆకాంక్ష ఉండేది. గ్రామాల్లో పోచమ్మ తల్లి బోనాలకు వివిధ వేషాధారణతో నృత్యాలు చేస్తూ డప్పు వాయించడం మొదలు పెట్టాడు. దాంతో మొట్టమొదటగా 1998లో హోలీ సందర్భంగా 'రింగుడు బిళ్ల రూపాయి దండ' అనే ప్రైవేట్ సాంగ్ చిత్రీకరించి ఆదరణ పొందాడు. అప్పటి నుంచి 200లకు పైగా ప్రైవేట్ ఆల్బమ్స్, సీరియళ్లు, షార్ట్ ఫిలిమ్స్, చేస్తూ కొద్దో గొప్పో సంపాదనలో పడ్డాడు.

సినిమా చాన్స్ వచ్చేసింది..

యూట్యూబ్‌లో, వాట్సాప్‌లలో ప్రైవేట్ సాంగ్స్‌తో జనాదరణ పొందుతున్న రవికి ఇటీవల 'పరకాల' అనే చిత్రంలో విలన్‌గా అవకాశం వచ్చింది. చిత్రీకరణ కూడా పూర్తై ఆగస్టు నెలలో విడుదలకు సిద్ధంగా ఉంది. మరిన్ని సీరియళ్లలో నటించేందుకు కూడా అవకాశాలు వచ్చాయి. తన యూట్యూబ్ చానల్‌కు ఎనిమిది లక్షల మంది సబ్‌స్క్రైబర్స్ ఉన్నారు. మొట్టమొదటగా గత నెలలో రూ.18వేలు ఆదాయం కూడా వచ్చింది. ప్రస్తుతం తను పూర్తిగా నటనా రంగానికి దగ్గరవుతున్నాడు. ముందుముందు మరెన్నో అవకాశాలు అందిపుచ్చుకొని తను ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆశిద్దాం.

ఆ ఎమ్మెల్యేలంతా డాక్టర్లు..



మహబూబాబాద్ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో వేదిక మీద ఆసీనులైన ఎమ్మెల్యేలు రాంచందర్‌నాయక్, మురళీనాయక్, వెంకట్రావు, రాగమయి

మహబూబాబాద్ టౌన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ పట్టణంలో బుధవారం జరిగిన కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుల సమ్మేళన సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేలంతా డాక్టర్లు కావడం విశేషం. మానుకోటలో పార్లమెంటరీ నియోజకవర్గ కార్యకర్తల సన్నాహక సమావేశాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. దీనికి మాజీ ఎమ్మెల్సీ, పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జీ పొట్ల నాగేశ్వర్‌రావు, కో ఇన్‌చార్జీగా ఉన్న సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టె రాగమయి, పార్లమెంటరీనియోజకవర్గపరిధిలోని భద్రాచలం, డోర్నకల్, మానుకోట ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, జాటోతు రాంచందర్‌నాయక్, భూక్య మురళీనాయక్ హాజరయ్యారు. వేదికపైన కాంగ్రెస్ రాష్ట్ర నేతలు, ఎమ్మెల్యేలు కలిసి మొత్తంగా 10 మంది ఆసీనులయ్యారు. సమావేశానికి హాజరైన నలుగురు సత్తుపల్లి, భద్రాచలం, డోర్నకల్, మానుకోట నియోజకవర్గ ఎమ్మెల్యేలు రాగమయి, వెంకట్రావు, రాంచందర్ నాయక్, మురళీనాయక్‌లు వైద్యులు కావడం విశేషం.

అందులో ముగ్గురు జనరల్ సర్జన్‌లు కాగా, మహిళా ఎమ్మెల్యే పల్మానాలిజిస్టు (శ్వాస కోశ సంబంధింత వైద్యురాలు). ఈ అంశం వేదికపై ప్రస్తావన రాగా సమావేశానికి హాజరైన ముఖ్య నేతలు నలుగురు ఎమ్మెల్యేలకు డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు.

నకిలీ పురుగు మందుల విక్రేతపై పీడీ యాక్టు



నిందితుడికి పీడీ యాక్టు ఉత్తర్వులు అందజేస్తున్న సీఐ గోపి

వరంగల్ క్రైం, జూలై 2 (ఆంధ్రజ్యోతి): నకిలీ పురుగు మందులు, విత్తనాలు విక్రయిస్తున్న వ్యక్తిపై పీడీ యాక్టు నమోదు చేస్తూ సీపీ సన్‌ప్రీత్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు పరకాల జైలులో ఉన్న నిందితుడు శాయంటపేటకు చెందిన నూక రాజేశ్‌కు బుధవారం మట్టెవాడ ఇన్స్‌పెక్టర్ గోపి పీడీ యాక్టు ఉత్తర్వులు అందజేసి చర్లపల్లి జైలుకు తరలించారు. నిందితుడు గతంలో సుబేదారి, కేయూ, హనుమకొండ పీఎస్‌ల పరిధిలో చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడటంతో ఏడు కేసులు నమోదు కాగా అరెస్టయ్యాడు. సులభంగా డబ్బులు సంపాదించేందుకు మరో ఆరుగురు వ్యక్తులతో కలిసి ముఠాగా ఏర్పడి పర్టిలైజర్ డీలర్ల నుంచి కాలం చెల్లిన పురుగు మందులు, నకిలీ విత్తనాలను కొనుగోలు చేసి రైతులకు విక్రయిస్తూ నిందితుడు ఏప్రిల్ 7న ఒకసారి 26న మరోసారి పట్టుబడగా మట్టెవాడ పోలీసుల అరెస్టు చేసి జైలుకు తరలించారు. ఈ ముఠాలో ఇప్పటికే ఒకరిపై పీడీ యాక్టు నమోదు చేయగా ఇది రెండో పీడీ యాక్టు అని సీపీ వెల్లడించారు. ఎవరైనా నకిలీ విత్తనాలు, పురుగుమందులు విక్రయిస్తే 7799848333 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

కొత్త కొత్తగా ఉంటదా!?

(5వ పేజీ తరువాయి)

జిల్లాలో 39,17,048మంది జనాభా ఉంది. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 2,30,064మంది ఉండాలి.. అంటే ఈ లెక్కన 17 స్థానాల వరకు పెరిగే ఛాన్స్ ఉంది. ఇందులో ఒకటి అటు ఇటుగా మారే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం 12 అసెంబ్లీ స్థానాలు ఉండగా, పునర్విభజనతో నాలుగైదు స్థానాలు పెరుగుతాయనే చర్చ జరుగుతుంది.

ఒకే జిల్లా.. ఒకే నియోజకవర్గం

అసెంబ్లీ నియోజకవర్గం మొత్తం ఒకే జిల్లా పరిధిలో ఉండాలని ప్రభుత్వం భావిస్తున్నది. దీంతో వరంగల్ వెస్ట్‌తో పాటు కొత్తగా ఏర్పడే మరో నియోజకవర్గం కూడా హనుమకొండ జిల్లా పరిధిలోకే వచ్చే అవకాశం ఉంది. హనుమకొండ జిల్లాలో 2011 జనాభా ప్రకారం 11,35,707 జనాభా ఉంది. ఈ లెక్క ప్రకారం నాలుగు నుంచి ఐదు అసెంబ్లీ స్థానాలు హనుమకొండలో ఏర్పాటు కావాల్సి ఉంది. ప్రస్తుతం వరంగల్ పశ్చిమ, పరకాల నియోజకవర్గాలే ఉన్నాయి. దీంతో కొత్తగా ఏర్పడే రెండు స్థానాలు హనుమకొండ జిల్లా పరిధిలోకి వస్తాయనే చర్చ జరుగుతుంది.

- అలాగే వరంగల్ జిల్లాలో 7,16,457 జనాభా ఉంది. ఇక్కడ కూడా మూడు అసెంబ్లీ స్థానాలు ఏర్పడే అవకాశం ఉంది. కొన్ని మండలాలు అటుఇటుగా ప్రస్తుతం ఉన్న వరంగల్‌తూర్పు, నర్సంపేట, వర్ధన్నపేట నియోజకవర్గాలు కొనసాగే అవకాశం ఉందనే చర్చ జరుగుతుంది.
- మహబూబాబాద్ జిల్లాలో 7,70,170 మంది జనాభా ఉండటంతో మహబూబాబాద్, డోర్నకల్‌తో పాటు కొత్తగా తొర్రూరు కేంద్రంగా మరో నియోజకవర్గం ఏర్పడే అవకాశం ఉందనే చర్చ జరుగుతుంది.
- జనగామ జిల్లాలో 5,82,457 మంది జనాభా ఉంది. ప్రస్తుతం ఉన్న జనగామ, స్టేషన్‌ఘనపూర్ కొనసాగే అవకాశం ఉన్నప్పటికీ, పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంపై అనుమానాలు ఉన్నాయనే టాక్ వినబడుతోంది. ఇప్పటికే పాలకుర్తి జనగామ, మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లో విస్తరించింది. ఈ పునర్విభజనలో ఏదో ఒక జిల్లా పరిధిలోకి వచ్చే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది.
- భూపాలపల్లిలో 4,16,763 మంది జనాభా ఉంది. ప్రస్తుతం ఇక్కడ భూపాలపల్లి నియోజకవర్గం ఒక్కటే ఉంది. కరీంనగర్ జిల్లాకు చెందిన మథని పరిధిలోని ఐదు మండలాలు ఈ జిల్లాలో ఉన్నాయి. ఈ ఐదు మండలాల్లో సుమారు 1.50లక్షల జనాభా ఉంది. ఒకే జిల్లా పరిధిలో కొత్త నియోజకవర్గం ఏర్పడటం కష్టమే. ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు సొంత ప్రాంతం కావటంతో కొత్త నియోజకవర్గం ఏర్పాటు చేస్తారనే టాక్ వినబడుతోంది. దీంతో కొత్తగా కాళేశ్వరం లేదా కాటారం పేరుతో మరో నియోజకవర్గం ఏర్పాటు చేస్తారా లేదా అనేది ఉత్కంఠగా మారింది.
- ములుగు జిల్లాలో 2,95,494 జనాభా ఉంది. ఇక్కడ ఒక్క నియోజకవర్గానికే అవకాశం ఉంది. ప్రస్తుతం భద్రాచలం నియోజకవర్గం పరిధిలో ఉన్న వెంటాపురం, వాజేడు మండలాలను ములుగు పరిధిలోకి తీసుకువచ్చి, ములుగు నియోజకవర్గానికి చెందిన మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ, గంగారం మండలాలను మహబూబాద్ నియోజకవర్గంలో విలీనం చేసే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది.

రిజర్వేషన్లలోనూ మార్పులు

నియోజకవర్గాల పునర్విభజనతో పాటు కొత్తగా అసెంబ్లీ స్థానాలు ఏర్పడుతుండటంతో ఇప్పుడున్న రిజర్వేషన్లు కూడా మారనున్నాయి. ప్రస్తుతం వరంగల్ ఎంపీ స్థానం ఎస్సీ, మహబూబాబాద్ ఎస్టీలకు రిజర్వుడు అయ్యాయి. దేశవ్యాప్తంగా జరిగే మార్పుల్లో ఈ రెండు స్థానాల్లో చేరే అసెంబ్లీ స్థానాల జనాభా అధారంగా అలాగే రిజర్వుడు స్థానాలుగా ఉంటాయా.. మార్పు జరుగుతుందా అనేది తేలనుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రస్తుతం 12 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, వీటిలో ములుగు, మహబూబాబాద్, డోర్నకల్ ఎస్టీ రిజర్వుడు స్థానాలు కాగా, స్టేషన్‌ఘనపూర్, వర్ధన్నపేట ఎస్సీ రిజర్వుడు స్థానాలు. మిగతా ఏడు అసెంబ్లీ స్థానాలు జనరల్‌గా కొనసాగుతున్నాయి. అయితే కొత్తగా నాలుగు స్థానాలు పెరిగే అవకాశం ఉండటంతో ఇప్పుడున్న రిజర్వుడు స్థానాల్లో కూడా మార్పులు జరిగే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రధానంగా వర్ధన్నపేట జనరల్ స్థానంగా మారుతుందని ఇప్పటి నుంచే రాజకీయ నాయకులు ఖర్చీఫ్ వేసుకుని తిరుగుతున్నారు. అలాగే అలాగే మహిళలకు 33శాతం రిజర్వేషన్ కూడా 2028 నుంచి అమలు చేస్తే ఉమ్మడి వరంగల్ జిల్లాలో నగరంలో ఒక స్థానంతో పాటు రూరల్‌లో రెండుమూడు స్థానాలు కలిపి నాలుగైదు స్థానాలు మహిళలకు రిజర్వు అయ్యే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది.

ఇలాగైతే ఎలా చదవాలి!?

- మౌలిక వసతుల కొరతతో రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల
- స్థలం కేటాయించినా, భవన నిర్మాణానికి మంజూరుకాని నిధులు
- జూనియర్ కళాశాల ప్రాంగణంలోనే తరగతుల నిర్వహణ
- తూర్పు నియోజకవర్గంతో పాటు చుట్టుపక్కల మండలాలకు అనుకూలం
- మంత్రి సురేఖ చొరవ తీసుకోవాలంటున్న విద్యావంతులు



రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల

శంభునిపేట(వరంగల్), జూలై 2 (ఆంధ్రజ్యోతి): అక్కడ అధ్యాపకులు ఫుల్.. మౌలిక వసతులు నిల్.. విద్యార్థులకు అందుబాటులో వున్నప్పటికీ మౌలిక సౌకర్యాల కొరత శాపంగా మారింది.. శాశ్వత భవనం కోసం స్థలం కేటాయించినా, నిర్మాణానికి మాత్రం చిల్లిగవ్వ మంజూరు కావడం లేదు.. ఇది రంగశాయిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరిస్థితి.

వరంగల్ తూర్పులో మొట్టమొదటి పూర్తి స్థాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలగా రంగశాయిపేట ప్రభుత్వ కళాశాలకు చరిత్ర ఉంది. వరంగల్‌లో ఎయిడెడ్ కళాశాలలు ఉండటంతో ప్రభుత్వం డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయలేదు. దీంతో పలువురు మేధావులు వరంగల్ తూర్పులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని జిల్లా అధికారులకు, నాయకులకు పలుమార్లు వినతి పత్రాలు అందించారు. అప్పటి ఎమ్మెల్యే బస్వరాజు సారయ్య విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్ళి 2008లో డిగ్రీ కళాశాలను మంజూరు చేయించారు. అప్పుడు నగరంలో కళాశాలకు స్థలం, భవనం, మంజూరు చేయకపోవటంతో అందుబాటులో వున్న రంగశాయిపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డిగ్రీ కళాశాలకు కొన్ని గదులు తాత్కాలికంగా కేటాయించారు. అప్పటి నుంచి అరకొర వసతులతోనే కళాశాల నిర్వహణ జరుగుతూ వచ్చింది. శాశ్వత భవనం, వసతులు లేకపోవడంతో విద్యార్థుల నుంచి ఆదరణ కనిపించ లేదు. అలాగే వున్న విద్యార్థులకు అభ్యాసం కష్టంగా మారింది. ఈ క్రమంలో సరైన తరగతి గదులు లేకపోవటంతో 2018లో రంగశాయిపేటకు సమీపంలోని ఖిలావరంగల్ పెట్రోల్‌పంప్ వద్ద అద్దె భవనంలోకి కళాశాలను తరలించారు. అయితే నిర్వహణ కారణాలతో 2022లో కళాశాలను తిరిగి ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనంలోకి మార్చారు.

ఇంటర్, డిగ్రీ కళాశాలల మధ్య సయోధ్య కుదరకపోవటంతో అధికారులు, నాయకులు జూనియర్ కళాశాల మైదానంలోనే డిగ్రీ కళాశాలకు స్థలాన్ని కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కానీ నిర్మాణానికి నిధులు కేటాయించలేదు. దీంతో ఇంటర్ కళాశాల భవనంలోనే కొన్ని గదుల్లో డిగ్రీ విద్యార్థులకు తరగతులను నిర్వహిస్తున్నారు. నగర ద్వారంగా ఉన్న రంగశాయిపేటలో జాతీయ రహదారికి డిగ్రీ కళాశాల కూతవేటు ఉండటంతో చుట్టు పక్కల మండలాలు, గ్రామాల నుండి వచ్చే విద్యార్థులకు రవాణా పరంగా బస్సు సౌకర్యం అదనపు ప్రయోజనంగా మారింది. కళాశాలలో బీఏ హెచ్‌పీపీ, ఈపీపీ, సోషియాలజీ, బీకాం జనరల్, కంప్యూటర్స్ అప్లికేషన్స్, బీఎస్సీ ఎంపీసీ, ఎంపీసీఎస్, బీజెడ్‌సీ, బీజెడ్ కంప్యూటర్ సైన్స్ గ్రూపులు ఉన్నాయి. ఎక్కువగా బీఎస్సీ ఎంపీసీఎస్, బీకాం, బీజెడ్‌సీఎస్ కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు ప్రాధాన్యత ఇస్తున్నారు. కళాశాలలో ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌తో పాటు 13 మంది బోధన, 15 మంది బోధనేతర సిబ్బంది పనిచేస్తున్నారు. కంప్యూటర్ సైన్స్, గణితం, ఇంగ్లిష్ అధ్యాపకుల పోస్టులు ఖాళీగా వున్నాయి. గత ఏడాది వరకు ఈ పోస్టుల్లో అతిథి అధ్యాపకులను నియమించి బోధన సాగించారు. ప్రస్తుతం కళాశాలలో అన్ని గ్రూపుల్లో కలిపి 368 మంది విద్యార్థుల అడ్మిషన్లు నమోదై వున్నాయి. ప్రస్తుత విద్యాసంవత్సరంలో దోస్త్ వెబ్‌సైట్ ద్వారా ఇప్పటికే 115 మంది విద్యార్థులు అడ్మిషన్లు తీసుకున్నారు. గత సంవత్సరం డిగ్రీ ఫలితాల్లో 80 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. నగర పరిధిలోని కళాశాల కావడంతో ఇక్కడ పూర్తి స్థాయిలో అధ్యాపకులు ఉన్నారు.

కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ, జూవాలజీ ల్యాబ్‌లతో పాటు తరగతి గదుల్లో డిజిటల్ బోర్డులు, కాన్ఫరెన్స్ హాల్, లైబ్రరీ ఉన్నాయి. కళాశాలకు పూర్తి స్థాయి భవనం నిర్మాణం చేపడితే అదనపు కోర్సులతో పాటు పీజీ కళాశాలగా మార్చుకోవచని స్థానిక విద్యావంతులు చెబుతున్నారు.

కార్పొరేట్‌కు దీటుగా బోధన



ప్రభుత్వ కళాశాలల్లో చదవాలనే ఆసక్తి విద్యార్థుల్లో పెరగాలి. ప్రభుత్వం అన్నీ ఉచితంగా అందటమే గాక, స్కాలర్‌షిప్‌లు అందిస్తుంది. విద్యార్థులకు ప్రభుత్వ హాస్టల్ వసతి కల్పిస్తున్నాం. డిజిటల్ స్మార్ట్ బోర్డులతో విద్యా బోధనతో పాటు సాంకేతిక నైపుణ్య అభివృద్ధి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాం.

– జి. శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్

శాశ్వత భవనం నిర్మించాలి..



రంగశాయిపేటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణం త్వరగా చేపట్టాలి. క్రీడలకు ఉపయోగపడేలా మైదానాన్ని ఉపయోగిస్తూ ఇంటర్, డిగ్రీ కళాశాలల భవనాలను నిర్మించాలి. కళాశాలలో మౌళిక వసతులు కల్పనకు, భవన నిర్మాణానికి నిదులు మంజూరు చేసి అభివృద్ధి పనులు ప్రారంభించాలి. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే, మంత్రి అయిన కొండా సురేఖ చొరవ తీసుకోవాలి.

– మండల పరుశరాములు, సోషల్ యాక్టివిస్ట్



ఎన్నికల కమిషన్‌లో వినతి పత్రం అందజేస్తున్న ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, తదితరులు

సురేఖ అసెంబ్లీ సభ్యత్వాన్ని రద్దు చేయాలి

ఎన్నికల కమిషన్‌కు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు వినతి

మిల్స్‌కాలనీ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): వరంగల్ తూర్పు ఎమ్మెల్యే, మంత్రి కొండా సురేఖ శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన హైదరాబాద్‌లోని ఎన్నికల కమిషన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఎన్నికల సమయంలో రూ.70 కోట్లు ఖర్చు చేశామని బహిరంగంగానే చెప్పడాన్ని సుమోటాగా తీసుకొని సభ్యత్వాన్ని రద్దు చేయాలని ఆయన ఎన్నికల సంఘాన్ని కోరారు.

హద్దు మీరి మాట్లాడుతున్నాడు..

మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి హద్దు మీరి మాట్లాడుతున్నాడని, వ్యక్తిగత దూషణలకు దిగడం ఆయనకే మంచిది కాదని ప్రదీప్‌రావు మండిపడ్డారు. బుధవారం ఓసిటీలోని ఆయన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ.. తమది సంస్కారం లేకుండా మాట్లాడే కుటుంబం కాదని అన్నారు. ఆనాడు రాజశేఖర్‌రెడ్డి, మొన్న కేసీఆర్, నిన్న రేవంత్‌రెడ్డి కాళ్లు పట్టుకొని పదవులు తెచ్చుకున్నది మీరు కాదా? అని ప్రశ్నించారు. ఉమ్మడి జిల్లాలోనే చాలా సార్లు పార్టీ మారిన చరిత్ర కొండా దంపతులదని ఎద్దేవా చేశారు. ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు.

మనుగడకే ముప్పు!

- పెరుగుతున్న పాలిథీన్ వినియోగం
- అరికట్టలేకపోతున్న అధికార యంత్రాంగం
- రోగాల బారిన పడుతున్న జనం

నేడు అంతర్జాతీయ ప్లాస్టిక్ సంచుల వ్యతిరేక దినం

ములుగు, జూలై 2(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ భూతం పర్యావరణంపై పెను ప్రభావం చూపుతోంది. ప్రజారోగ్యాన్ని విచ్ఛిన్నం చేస్తోంది. ప్లాస్టిక్ అనే అనర్థాలు కలుగుతాయని తెలిసినప్పటికీ యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. టీ తాగే కప్పు నుంచి భోజనం చేసే ప్లేట్ దాకా అంతా ప్లాస్టిక్ మయమైంది. ప్లాస్టిక్ వాడకంతో కలిగే దుష్ప్రభావాల పట్ల ప్రభుత్వాలు ఎన్ని అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నా వినియోగదారుల్లో మార్పు రావడం లేదు. ఉత్పత్తి అవుతోంది కాబట్టి ప్లాస్టిక్‌ను వాడుతున్నామనే ధోరణి అవలంబిస్తున్నారు. తయారీని నిర్మూలించే చర్యలు చేపట్టకపోవడమే ప్లాస్టిక్ వినియోగానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. ప్లాస్టిక్‌ను అరికట్టాల్సిన అధికారులు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. దీంతో ఈ వ్యాపారం మూడుపువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. ప్లాస్టిక్ వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించకుంటే సర్వనాశనం తప్పదని పర్యావరణ ప్రేమికులు చెబుతున్నారు.

యథేచ్ఛగా ప్లాస్టిక్ వినియోగం

మానవ జీవితంలో ప్లాస్టిక్ వినియోగం తప్పనిసరి అన్నట్టు అత్యధికులు భావిస్తున్నారు. వస్త్ర దుకాణాలు, మాంసం కొట్లు, కిరాణా షాపులు.. ఇలా ఎక్కడా చూసినా ప్లాస్టిక్ సంచులు దర్శనమిస్తున్నాయి. కూరగాయలు, చేపల మార్కెట్లల్లోనైతే వీటి వినియోగం ఎక్కువగా కనిపిస్తోంది. పిల్లలు తాగే పాల ప్యాకెట్స్ నుంచి దాహం వేస్తే కొనుక్కొని తాగే మంచినీళ్ల బాటిళ్ల వరకు ప్లాస్టికే.. ఏ చిన్న ఫంక్షన్ చేసినా... తినే ప్లేట్ల నుంచి తాగే గ్లాసులు ప్లాస్టికే... ఇలా నిత్య జీవితంలో విచ్చల విడిగా ప్లాస్టిక్‌ను వాడి పడేస్తుండడంతో అటు పర్యావరణానికి, ఇటు మానవ ఆరోగ్యానికీ ముప్పు వాటిళ్లుతోంది. మనం వాడిపడేసే ప్లాస్టిక్ వ్యర్థాలు



భూమిలో కలవడానికి కొన్ని లక్షల సంవత్సరాలు పడుతుంది. 75 మైక్రాన్ల లోపు మందం ఉన్న ప్లాస్టిక్‌ను వినియోగించకూడదనే నిబంధన ఉన్నా వాటిని అమలు పరచడంలో అధికారులు విఫలమవుతున్నారు. దీంతో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ సంచులు, బాటిళ్లు, ప్లేట్లు, గ్లాసులు దర్శనమిస్తున్నాయి.

ప్రాణాంతకంగా పాలిథీన్ కవర్లు

నిత్యం మన వాడకాల్లో సగానికి పైగా ప్లాస్టిక్ ఉంటుంది. అది పర్యావరణాన్ని విచ్ఛిన్నం చేస్తూ ప్రజల ఆరోగ్యాన్ని పీల్చి పిప్పిచేస్తోంది. కంటికి కనిపించని ప్లాస్టిక్ రేణువులు క్యాన్సర్లకు కారణమవుతూ కటుంబాలను చిన్నాభిన్న చేస్తున్నాయి. 75 నుంచి 120 మైక్రాన్ల కంటే తక్కువ పరిమాణం ఉన్న పాలిథీన్ కవర్లను వినియోగిస్తుండటంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. సింగిల్ యూజ్ కవర్లను వాడటం వల్ల వారానికి మనిషి శరీరంలోకి సగటున 5 గ్రాముల మైక్రో ప్లాస్టిక్ రేణువులు వెళ్తున్నట్లు సర్వేలు చెబుతున్నాయి. వాటిని అమ్మకూడదనే నిబంధనలు ఉన్నప్పటికీ అధికారులు అరికట్టడంలో విఫలమవతున్నారనే విమర్శలు వస్తున్నాయి. అలాగే ప్రజలు వినియోగించిన కవర్లను రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ పడేయడంతో వాటిని తిన్న మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయని జంతు ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నార సంచులను అందుబాటులోకి తీసుకొస్తే పర్యావరణానికి, ప్రజలకు మంచిందని పలువురు సూచనలు చేస్తున్నారు. ప్లాస్టిక్ నివారణకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

దృష్టి సారించకుంటే సర్వనాశనమే..

ప్రకృతి సోయగాలు, పచ్చని అడవులు, పర్యాటక ప్రాంతాలు, ప్రసిద్ధి ఆలయాలు.. ఇలా ఎన్నో ప్రత్యేకతలు ములుగు జిల్లా సొంతం. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన, యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం ఉంది. ఆసియాలోనే అతి పెద్దదైన మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర ఈ జిల్లాలో జరుగుతుంది. రామప్పకు ప్రపంచ నలుమూలల నుంచి పర్యాటకులు, రెండేళ్లకోసారి జరిగే మేడారం మహా జాతరకు దేశ నలుమూలల నుంచి భక్తులు వస్తూ పోతుంటారు. అయితే.. మేడారం మహా జాతర సమయంలో లక్షల కొద్దీ వచ్చిపోయే భక్తులు వినియోగించే ప్లాస్టిక్‌తో ఈ ప్రాతమంతా కాలుష్యంతో నిండిపోతుంది. దీంతో జిల్లా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పర్యాటక, ప్రసిద్ధి ఆలయాలకు వచ్చిపోయే జనం విచ్చల విడిగా వాడిపడేసిన ప్లాస్టిక్ భూమిలో కలిసిపోవడంతో భూగర్భ జలాలు ఇంకిపోతున్నాయని పలువురు చెబుతున్నారు. 2020 మేడారం మహా జాతరకు ముందు అప్పటి కలెక్టర్ నారాయణరెడ్డి ప్లాస్టిక్ నియంత్రణ పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఓ ఉద్యమంలా విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించారు. ప్లాస్టిక్ కాలకేయుని బొమ్మను 2019 డిసెంబరులో 20 అడుగుల ఎత్తుగల కాలకేయుని బొమ్మను జిల్లా కేంద్రంలోని గట్టమ్మ సెంటర్ వద్ద ఏర్పాటు చేశారు. జిల్లా ప్రజలు ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా మానేయాలని పిలుపునిచ్చారు. అయినప్పటికీ ప్రజల్లో ఎలాంటి మార్పురాలేదు. అయితే.. జిల్లా అధికారులు ప్లాస్టిక్ నియంత్రణపై అడపాదడపా కార్యక్రమాలు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారనే తప్ప ప్లాస్టిక్ సంచుల స్థానంలో ప్రత్యామ్నాయ మార్గాలు చూపడంలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏదేమైనప్పటికీ ప్లాస్టిక్ వాడకంలో ప్రజలు మారకుంటే ప్లాస్టిక్ భూతాని బలికావాల్సిందేనని పర్యావరణ ప్రేమికులు అంటున్నారు. ప్లాస్టిక్ నియంత్రణపై దృష్టి సారించకుంటే సర్వనాశనం తప్పదని అంటున్నారు.

జిల్లాలో పెరుగుతున్న క్యాన్సర్ బాధితులు

ములుగు జిల్లాలో 2018 నుంచి 2025 జూన్ వరకు 240 క్యాన్సర్ కేసులు నమోదైనట్లు వైద్యశాఖ లెక్కలు చెబుతున్నాయి. ఈ మహమ్మారి పెరగడానికి కారణాలు ఏమైనప్పటికీ వీటిలో ప్లాస్టిక్ వినియోగం కూడా తప్పకుండా ఉండొచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మండలాల వారీగా ఈ ఏడేళ్ల కాలంలో క్యాన్సర్ బాధితుల సంఖ్య మండలాల వారీగా చూసినట్టయితే.. ములుగు మండలంలో 82 మంది ఈ మహమ్మారి బారిన పడ్డారు. గోవిందరావుపేట 35, మంగపేట 32, ఏటూరు నాగారం 20, వాజేడు 20, వెంకటాపురం 18, తాడ్వాయి 17, కన్నాయిగూడెం 9, వెంకటాపూర్‌లో 7 కేసులు నమోదయ్యాయి.

ఉరి వేసుకొని ఒకరి ఆత్మహత్య

మంగపేట, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి మనస్తాపం చెంది ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కమలాపురం ఎస్సీకాలనీలో బుధవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కప్పల ముత్యాలు(71) కొద్ది సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వైద్యం చేయించుకున్నా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య కప్పల లక్ష్మి ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్సై సూరి కేసు నమోదు చేశారు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.



ముత్యాలు (ఫైల్)

ఫర్టిలైజర్ వ్యాపారి హఠాన్మరణం

మంగపేట, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మంపేటకు చెందిన ఫర్టిలైజర్ వ్యాపారి చిలుకమర్రి వేణు(32) గుండెపోటుతో మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రోజూ లాగే మంగళవారం షాపు నిర్వహించుకొని ఇంటికి వెళ్లిన వేణు అర్ధరాత్రి ఛాతీ నొప్పితో కుప్పకూలారు. కుటుంబ సభ్యులు వెంటనే ఏటూరునాగారం సివిల్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని కార్పొరేట్ ఆస్పత్రికి, ఆతర్వాత హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. చికిత్స అందిస్తున్న క్రమంలోనే వేణు మృతి చెందారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

మొగుళ్లపల్లి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని ఎస్సై బి.అశోక్ సూచించారు. బుధవారం మండలంలోని కొర్కిశాల మోడల్ పాఠశాలలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సైబర్ నేరగాళ్లు ఫేక్ పోలీస్ ఆఫీసర్ అని చెప్పుకుని అమాయకులకు కాల్ చేసి డిజిటల్ అరెస్టు చేస్తున్నా మని బెదిరించి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. అసలు డిజిటల్ అరెస్టు అనేది ఉండదని, ఎవరికైనా సైబర్ నేరగాళ్లు కాల్ చేస్తే వెంటనే 1930కి ఫిర్యాదు చేయాలని అన్నారు. అదేవిధంగా మ్యాట్రిమోనియల్ సైట్స్, పార్ట్‌టైం జాబ్ ఆఫర్స్ మోసం గురించి తెలియజేశారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

మహదేవపూర్ రూరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బెగ్లూర్‌లో తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో బుధవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన పథకాలను వినియోగించుకోవాలన్నారు. జూలై నుంచి సెప్టెంబరు వరకు జనసురక్ష కార్యక్రమం ఉంటుందని, ప్రజలంతా ఈపథకాలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్ నాగరాజు, ఎంపీవో ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి దామోదర్, కారోబార్ మహేష్ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి హద్దుల పరిశీలన

మల్హర్, జూలై 2(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన తాడిచర్ల నుంచి కిషన్‌రావుపల్లి అటవీ మార్గం మీదుగా భూపాలపల్లికి రోడ్డు నిర్మాణానికి హద్దుల ఏర్పాటును ఎఫ్‌డీవో అప్పలకొండ బుధవారం పరిశీలించారు. అటవీ మార్గం మీదుగా ఆరు కిలో మీటర్ల పైన ఆరు మీటర్ల వెడెల్పుతో రోడ్డు నిర్మాణం కానుంది. దీంతో అటవీ మార్గంలో హద్దులను ఏర్పాటు చేశారు. ఆర్అండ్‌బీ, ఫారెస్టు అధికారులు సంయుక్తంగా ఈ చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో రేంజర్ రాజేశ్వర్‌రావు, ఏఈ అవినాష్, మాజీ ఎంపీపీ చింతలపల్లి మల్హల్‌రావు, ఫారెస్టు అధికారులు పాల్గొన్నారు.

బూడిదపల్లిలో పోచమ్మ కొలువు

కాటారం, జూలై 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగులగూడెం గ్రామ పంచాయతీ పరిధి బూడిదపల్లిలో పోచమ్మ కొలుపు కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. గ్రామ శివారులోని బొడ్రాయి, గ్రామ దేవతలకు పూజలు చేసిన అనంతరం డప్పు చప్పుళ్ల, పంబాలవాళ్ల జమిడికల మధ్య పోచమ్మను కొలిచే కార్యక్రమం వైభవంగా సాగింది. వందలాది మంది ప్రజలు, యువకులు సందడి చేశారు. గురువారం గ్రామ శివారు ప్రాంతాల గుండా యాటలు బలిచ్చి ఊరు కట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు గ్రామ పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు కులసంఘాల నాయకులు, గ్రామపెద్దలు, వివిధ వృత్తులవారు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ కార్యవర్గం ఎన్నిక

మహదేవపూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడు గ్రామాల ఎమ్మార్పీఎస్ కమిటీలను బుధవారం ఎన్నుకున్నారు. జిల్లా ఇన్‌చార్జి రుద్రారపు రామచందర్, మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. అన్నారం గ్రామ శాఖ అధ్యక్షుడిగా ఈరుగుల రాజబాపు, ఉపాధ్యక్షుడిగా మంచినీళ్ల సతీష్, ప్రధాన కార్యదర్శిగా తోటపల్లి సంజీవ్, కార్యదర్శి సోదండి దేవేందర్, కోశాధికారిగా వడ్లకొండ దేవేందర్, ప్రచార కార్యదర్శిగా ఈరుగురాల శశికుమార్ ఎన్నికయ్యారు. మద్దులపల్లి గ్రామ గౌరవ అధ్యక్షుడిగా చాకినారపు శ్రీను, అధ్యక్షుడిగా చకినారపు ప్రశాంత్, ఉపాధ్యక్షుడిగా చేకూర్తి రాజయ్య, ప్రధాన కార్యదర్శిగా చకినారపు రవి, కార్యదర్శిగా చేకూర్తి మల్లేష్, కోశాధికారిగా కమ్మంపల్లి సారయ్య, ప్రచార కార్యదర్శిగా చకిరారపు ఎర్రయ్య ఎన్నుకున్నారు. పలుగుల గ్రామ శాఖ అధ్యక్షుడిగా లేతకారి శంకర్, ఉపాధ్యక్షుడిగా మంద సురేష్, కార్యదర్శి మంద వినోద్, ప్రధాన కార్యదర్శి నిట్టూరి రాజబాపు, ప్రచార కార్యదర్శిగా చిట్యాల రవి, కోశాధికారిగా నిట్టూరి రమేష్‌ను ఎన్నుకున్నారు.

పీహెచ్‌సీకి ఉపకరణాల అందజేత

రేగొండ, జూలై 2(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఎక్సెల్ యూత్ సభ్యులు బుధవారం వైద్య ఉపకరణాలు, ఫర్నిచర్ వితరణ చేశారు. మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు కటంగూరి మనోహర్‌రెడ్డి చేతుల మీదుగా వైద్యాధికారి హిమబిందుకు అందజేశారు. వితరణ చేసిన వాటిలో బెంచీలు, వాటర్ డిస్పెన్సరీస్, కుర్చీలు, టేబుల్స్ ఉన్నాయి ఈ కార్యక్రమంలో యూత్ అసోసియేషన్ ఫౌండర్ కటంగూరి రాజేశ్‌రెడ్డి, యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు శంకర్, పంచాయితీ కార్యదర్శి తుల్జారాణి తదితరులు పాల్గొన్నారు.

బిల్లులకు చిల్లులు!

పక్కదారి పడుతున్న పాఠశాలల నిధులు

గణపురం, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా మొత్తం 22 ప్రైమరీ పాఠశాలలు, రెండు యూపీఎస్, ఆరు జడ్పీ హెచ్‌ఎస్‌లు, ఒకటి మోడల్ స్కూల్, ఒకటి కేజీబీవీ, ఒకటి జ్యోతి బాపూలే పాఠశాలలు ఉన్నాయి. వీటికి ప్రతి విద్యా సంవత్సరం అభివృద్ధి పేరిట నిధులు మంజూరవుతుంటాయి. ఇందులో భాగంగానే గణపురం మండలానికి కూడా వచ్చాయి. బడిబాట కార్యక్రమానికి రూ.1000, స్కూల్ గ్రాంట్ ఫేస్-1 కింద రూ.5000, స్పోర్ట్స్ గ్రాంట్ ఫేస్-1 కింద రూ.2500, స్కూల్ గ్రాంట్ ఫేస్-2 కింద రూ.5000, స్పోర్ట్స్ గ్రాంట్ ఫేస్-2 కింద రూ.2500, స్కూల్ సేఫ్టీ అండ్ సెక్యూరిటీ కింద రూ.500, యూత్ క్లబ్, ఎకో క్లబ్ నిర్వహణ కోసం రూ.3000, ఈబీఎస్‌బీ కింద రూ.1000 మంజూరవుతాయి. ఇలా ప్రతి పాఠశాలకూ మొత్తం రూ.20,500 వస్తాయి. ఇలా ఒక్కో పాఠశాలకు విద్యార్థుల సంఖ్యను ఆధారంగా నిధులు మంజూరవుతాయి. అయితే.. గణపురం మండలానికి కేటాయించిన నిధులు పక్కదారి పడ్డాయని తెలుస్తోంది. అవి పాఠశాలకు ఖర్చు చేయకుండానే ఓ అధికారి జేబులు నింపుకున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

నిధులు స్వాహా అయిన పాఠశాలలు ఇవే..

మండలంలోని ఎంపీపీఎస్ బంగ్లాపల్లి, మండల కేంద్రంలోని హరిజనవాడ పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి రెండు పాఠశాలల్లో ఇద్దరు విద్యార్థుల చొప్పున అడ్మిషన్ చూపించారు. కానీ విద్యార్థులు హాజరుకాకపోవడంతో టీచర్లను డిప్యూటేషన్‌పై మరో పాఠశాలకు పంపించారు. ఇలా రెండు పాఠశాలలు జీరో ఎన్‌రోల్‌మెంట్ అయినప్పటికీ వాటి నిర్వహణ పేరుతో రూ.40వేల వరకు స్వాహా చేసినట్లు తెలిసింది. అంతేకాకుండా రంగారావుపల్లి పాఠశాల నుంచి రూ.12000, ఎంపీపీఎస్ పరుశురాంపల్లికి రూ.20,500, మైలారం ఎంపీపీఎస్‌కు రూ.20,500 వచ్చిన బిల్లుల్లో అక్రమాలు చోటుచేసుకున్నట్లు సమాచారం. జీరో ఎన్‌రోల్‌మెంట్ పాఠశాలకు నిధులు మంజూరైనా వాటిని ఖర్చు చేయకుండా ఆ డబ్బులను ప్రభుత్వానికి వెనక్కి పంపించాలని నిబంధనలు ఉన్నాయి. కానీ, ఆ అధికారి ఆ నిధులను అప్పనంగా వాడుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

సాయిబాబా ఆలయంలో చోరీ

ఏటూరునాగారం, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని షిరిడి సాయిబాబా ఆలయంలో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని ఓ వ్యక్తి తాళాలను పగలగొట్టి ఆలయం లోపల ఉన్న హుండీలోని నగదును అపహరించాడు. దీనికి సంబంధించిన ఫుటేజీలు ఆలయంలోని సీసీ కెమెరాల్లో రికార్డులయ్యాయి. దొంగతనానికి పాల్పడటానికి వచ్చిన వ్యక్తి ముందుగా సాయిబాబాకు దండం పెట్టుకొని, ఆ తర్వాత ఆలయంలోని హుండీని బయటకు తీసుకెళ్లిన దృశ్యాలు నమోదయ్యాయి. బుధవారం ఉదయం ఆలయానికి చేరు కున్న ఆలయ కమిటీ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్ ఈ విషయాన్ని గమనించి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆయన ఫిర్యాదు మేరకు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

ఏటూరునాగారం, జూలై 2 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న పశువులను అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. డీసీఎం వాహనంలో టమాటా ట్రేల చాటున దాచి అక్రమంగా తరలిస్తున్న పశువులను చెక్‌పోస్టు వద్ద పట్టుకుని పోలీసులకు అప్పగించారు. బుధవారం ఈ సంఘటన జరిగింది. ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన కథనం మేరకు.. ఒడిశా నుంచి హైదరాబాద్‌కు డీసీఎం వ్యాన్‌లో పశువులను అక్రమంగా తరలిస్తూ అవి బయట కనిపించకుండా టమాటా ట్రేలను అడ్డుగా పెట్టారు. బుధవారం ఉదయం ఏటూరునాగారం చెక్ పోస్టు వద్ద అటవీశాఖ అధికారులను గమనించిన డ్రైవర్ వాహనం వేగం పెంచాడు. దీంతో అప్రమత్తమైన అటవీశాఖ అధికారులు సుమారు రెండు కిలోమీటర్ల మేర వెంబడించి పట్టుకున్నారు. అనంతరం తనిఖీ చేయగా, అక్రమంగా పశువులను తరలిస్తున్న విషయం వెలుగు చూసింది. దీంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు వ్యాన్‌ను స్వాధీనం చేసుకొని, అందులో ఉన్న 28 పశువులను భూపాలపల్లి జిల్లాలోని రాంపూర్ గోశాలకు తరలించారు. పశువుల రవాణాకు పాల్పడిన రంగారెడ్డి జిల్లా తక్కలపల్లి గ్రామానికి చెందిన కంబాలపల్లి రమేష్, ఒడిశా రాష్ట్ర నవరంగ్పూర్ గ్రామానికి చెందిన హరికృష్ణ హరిజన్, హైదరాబాద్‌కు చెందిన సత్తూరి రామకృష్ణపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

గోవిందరావుపేట, జూలై 2 (ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను అధునాతన టెక్నాలజీ సహాయంతో కనిపెట్టి బాధితుడికి అందజేశారు పస్రా ఎస్సై కమలాకర్. మండలంలోని ఎల్బీనగర్ గ్రామానికి చెందిన బొగ్గుల రవి మూడునెలల క్రితం ద్విచక్రవాహనంపై పస్రాకు వస్తున్నక్రమంలో తన రెడ్‌మీ సెల్‌ఫోన్ గోవిందరావుపేట సమీపంలో పడిపోయింది. దీంతో బాధితుడు పస్రా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. స్పందించిన ఎస్సై కమలాకర్ సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో పొందుపరిచి లొకేషన్ ఆధారంగా కనిపెట్టారు. ఈమేరకు బుధవారం ఎస్సై కమాలకర్ బాధితుడు రవికి సెల్‌ఫోన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఈఐఆర్ కానిస్టేబుల్ రతన్‌సింగ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫొటో గ్రాఫర్లు నైపుణ్యాలను పెంచుకోవాలి

వెంకటాపురం, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఫొటోగ్రాఫర్లు రానున్నకాలంలో టెక్నాలజీకి అనుగుణంగా నైపుణ్యాలను పెంచుకోవాలని ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని పాలెంవాగు ప్రాజెక్టు సమీపంలో మండల ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కుటుంబ భరోసా పథకంలో ప్రతి ఒక్కరూ చేరి వాటి ఫలాలను అందిపుచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు లింగమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ గడదాసు సునీల్, వెంకటాపురం, వాజేడు మండలాల ఫొటోగ్రాఫర్లు చంద్రకళ, సాంబశివరావు, సతీష్, నర్సింహారావు, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రాళ్లవాగు వద్ద రాకపోకలకు ఇబ్బందులు

వెంకటాపురం, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాళ్లవాగు వద్ద రాకపోకలకు ఇబ్బందులు పడాల్సివస్తోంది. మండలంలో కురుస్తున్న వర్షాలకు రాళ్లవాగు వద్ద తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రోడ్డు బురదమయంగా మారడంతో వాహనాలు వెళ్లాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో భద్రాచలం ఆర్టీసీ డిపోకు చెందిన బస్సులను చర్ల మండలం మీదుగా తిప్పుండా, మణుగూరు వయా ఏటూరునాగారం మీదుగా తిప్పుతున్నారు. దీంతో మండలంలోని ఎదిర గ్రామం నుంచి వెంకటాపురం వరకు ఉన్న గ్రామాల ప్రజలు ఆర్టీసీ బస్సులు రాకపోవడంతో ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రాళ్లవాగు వంతెన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో పశువుల మృతి

కన్నాయిగూడెం, జూలై 2 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో రెండు పశువులు మృతి చెందిన సంఘటన మండలంలోని సర్వాయి పంచాయతీ పరిధి చిట్యాలలో బుధవారం చోటు చేసుకుంది. బాధితులు సోడె నారాయణ, సోడే రాకేష్ తెలిపిన వివరాల ప్రకారం.. రోజూ లాగానే దుక్కిటెద్దు, ఆవుదూడలు పశువులతో కలిసి మేత కోసం అని సమీపంలోని పొలాల్లోకి వెళ్లాయి. తిరిగి వచ్చే క్రమంలో గ్రామంలో ఉన్న బీఎస్ఎన్ఎల్ టవర్ చుట్టూ ఉన్న ఇనుప కంచెకు విద్యుత్ సరఫరా కావడంతో అది తాకి ఒక దుక్కిటెద్దు, ఒక దూడ విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాయి. వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునే వాడినని, ఇప్పుడు దుక్కిటెద్దు మృత్యువాత పడటంతో కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలని బాధితడు రాకేష్ కంటతడి పెట్టాడు. ప్రభుత్వం తరపున నష్టపరిహారం అందించాలని ఇద్దరు బాధితులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

పీహెచ్‌సీల ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు

వెంకటాపురం, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిరుతపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలో బుధవారం వైద్యశిబిరం జరిగింది. వైద్యాధికారి జ్యోతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలలోని బాలికలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం సీజనల్ వ్యాధులబారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాన్నారు. శిబిరంలో వైద్యులు పవన్‌కల్యాణ్, మనోహర్, సిబ్బంది యాకమ్మ, సత్యనారాయణ, రామలక్ష్మి, రాఘవులు, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

- ఏటూరునాగారం (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొయ్యూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఆచార్య నగర్‌లో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ఇంటింటి జ్వర సర్వే, దోమల నివారణకు థెమోఫాస్ స్ప్రేయింగ్ కార్యక్రమాలను వైద్యాధికారి డాక్టర్ సుమలత చేపట్టారు. జ్వర లక్షణాలు ఉన్నవారిని గుర్తించి, వర్షాకాలంలో వచ్చే మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో ఎస్‌యూవో నర్సింహారావు, సూపర్‌వైజర్ ఖలీల్, ఏఎన్ఎం గీత, సరితతో పాటు ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

- గోవిందరావుపేట (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరం జరగ్గా సూపర్‌వైజర్ రజని, లింకు వర్కర్ టి.కిషన్ గ్రామస్థులకు ఆరోగ్యపరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాల సీజన్‌లో ప్రజలు వ్యాధులబారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, హెచ్‌ఐవీతోపాటు అన్నిరకాల పరీక్షలు చేయించుకోవాలన్నారు. శిబిరంలో వైద్యసిబ్బంది శ్రీనివాసరెడ్డి, శకుంతల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.
- మంగపేట (ఆంధ్రజ్యోతి): మండలంలోని చుంచుపల్లి గిరిజన ఆశ్రమ బాలిక వసతి గృహం, మంగపేట పీహెచ్‌సీ పరిధిలోని తిమ్మంపేట గిరిజన బాలుర హాస్టల్‌లో బుధవారం వైద్య శిబిరాలను నిర్వహించారు. తిమ్మంపేట బాలుర హాస్టల్‌లో 68 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సోమ అఖిల, తిమ్మంపేట పల్లే దవాఖాన వైద్యాధికారి చందా మనోజ్‌కుమార్, హెచ్‌వీ పద్మ, ఏఎన్ఎం సత్తెమ్మ, ఆశా కార్యకర్తలు రజిత, సమ్మక్క తదితరులు పాల్గొన్నారు. చుంచుపల్లి గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 65 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేసినట్లు వైద్యాధికారి యమున తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వీ. పద్మ, ఏఎన్ఎం భాగ్యలక్ష్మి, ఆశా కార్యకర్తలు నాగమణి తదితరులు పాల్గొన్నారు.

తర'గతి' ఇంతేనా..?

(5వ పేజీ తరువాయి)

విద్యార్థులు ఉండగా రోజుకు ఇద్దరు, ముగ్గురు మాత్రమే వస్తున్నారు. ద్వితీయ సంవత్స రంలో 37 మంది విద్యార్థులు ఉన్నారు. వీరి హాజరు శాతం కూడా తక్కువగానే నమోదవుతోందని తెలు స్తోంది. విద్యార్థులు లేకపోవడంతో విధుల పట్ల అధ్యాపకులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. మల్హర్ మండలంలోని తాడిచర్లలో జూనియర్ కళాశాల భవనం శిథిలావస్థకు చేరుకుం ది. ల్యాబ్‌కు గదులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందు లు ఎదుర్కొంటున్నారు. ఓసీ బ్లాస్టింగ్‌లకు భవనం బీటలు వారింది. విద్యార్థులు భయాందోళనకు గుర వుతున్నారు. చిట్యాల జూనియర్ కాలేజీలో బాలుర కు మరుగుదొడ్లు లేవు. తాగునీరు అందుబాటులో ఉండటం లేదు. ఇక్కడ 214 మంది విద్యార్థులు ఉండగా 14 అధ్యాపకులు పూర్తిస్థాయిలో పనిచేస్తున్నారు. మహదేవపూర్ కాలేజీలో 194 మంది విద్యా ర్థులు ఉండగా బాలురకు మరుగుదొడ్లు లేవు. ప్రహా రీ లేక మద్యం ప్రియులు కళాశాల ఆవరణలోకి వచ్చి తచ్చాడుతున్నట్టు తెలుస్తోంది. అడవికి దగ్గర గా ఉండటంతో అడవి పందులు ఈ కాలేజీలోకి వస్తున్నాయని విద్యార్థులు, అధ్యాపకులు భయాందోళనకు గురవుతున్నారు. అలాగే ఈ కళాశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. పలుమార్లు ప్రజాప్రతినిధు లకు, అధికారులకు తెలిపినప్పటికీ పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

వర్షానికి కూలిన పెంకుటిల్లు




మహాముత్తారంలో వర్షానికి కూలిన పెంకుటిల్లు

మహాముత్తారం, జూలై2 (ఆంధ్రజ్యోతి): బుధవారం కురిసిన వర్షానికి మండల కేంద్రానికి చెందిన రంగు రాజయ్య(ఆరుడ) అనే వ్యక్తికి చెందిన పెంకుటిల్లు కూలిపోయింది. ఇంట్లో మేకలు, కోళ్లను పెంచుతూరాజయ్య, ఆయన భార్య నివసిస్తున్నారు. ఇల్లు కూలిన సమయంలో ఇంట్లో దం పతులు ఇద్దరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. మేకలు, కోళ్ల కోసం ఏర్పాటు చేసున్న సమగ్రి దెబ్బతిన్నాయి. మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి భూమి మెత్తబడి ఇల్లు కూలి పోయిందని తెలుస్తోంది. ప్రభు త్వం తమను ఆదుకో వాలని బాధితుడు రాజయ్య కోరుతున్నాడు.

చెరువులకు జలకళ

కాటారం, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. రెండు, మూడు రోజులుగా కురుస్తున్న ఓ మోస్తరు వర్షాలకు సుమారు 3సెం.మీ మేర భారీ వర్షం తోడవడంతో చెరువులు, కుంటలు జలకళను సంతరించు కుంటున్నాయి. జూన్‌లో సరైన వర్షాపాతం లేక అన్నదాతలు ఆందోళన చెందారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో కాస్త ఊరట చెందారు. భారీ వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమ యమయ్యాయి. రెండు మూడు భారీ వర్షాలు కురిస్తే చెరువులు, కుంటలు నిండుతాయని, వానాకాలం సీజన్‌లో వరి నారుమళ్లు పోసి నాట్లు వేయడానికి దోహదపడుతాయని రైతులు అభిప్రాయపడుతున్నారు.



జలకళ సంతరించుకున్న గారెపల్లి చెరువు